
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
తిరుపతి
జిల్లా వార్తలు
గురువారం 25 జూలై 2024



వెయ్యేళ్ల నాటి పద్ధతిలో....

- ముక్కంటి ఆలయ పైకప్పు బీటలకు మరమ్మతు పనులు
- రూ.5కోట్ల అంచనాతో ప్రారంభం
- ఖర్చు భరిస్తున్న పూణె భక్తుడు


ఆలయం పైకప్పుపై పనులు

శ్రీకాళహస్తి, జూలై 24: శ్రీకాళహస్తీశ్వరాలయ పైకప్పు బీటల మరమ్మతు పనులు పురాతన నిర్మాణశైలిలో సాగుతున్నాయి. ఐఐటీ నిపుణుల పర్యవేక్షణలో ప్రాచీన పద్ధతుల్లో సహజ పదార్థాలతోనే ఈ పనులు జరుగుతున్నాయి. పూణెకి చెందిన భక్తులు దాదాపు రూ. అయిదు కోట్ల వ్యయంతో ఈ పనులు చేయిస్తున్నారు. కొన్నేళ్ల కిందట ముక్కంటి ఆలయం పైకప్పుకు పగుళ్లువారి వాన కురిస్తే నీరు కారేది. స్వామి అమ్మవార్ల గర్భాలయ సన్నిధిలో వర్షపునీరు కారేది. ఆలయ అధికారులను, భక్తులను ఈ పరిణామం కలవరపరిచింది. పురాతన ఆలయానికి మరమ్మతు పనులు ఆధునిక పద్ధతిలో చేపడితే ప్రాచీనతకు భంగం వాటిల్లుతుంది. ఈ సమయంలో మసూరులోని కేంద్ర ఆర్కియాలజీ శాఖలో ఎపిగ్రఫీ విభాగ జాతీయ డైరెక్టర్‌గా ఉన్న తిరుపతి వాసి మునిరత్నంరెడ్డి చొరవ తీసుకున్నారు. భారతీయ ప్రాచీన నిర్మాణ పద్ధతులు అనుసరించి మరమ్మతులకు పూనుకోవాలని సూచించారు. పూణెకు చెందిన వ్యాపారి వెంకటేశ్వరరావు అనే భక్తుడిని ఆయన సంప్రదించారు. ఉత్తరాదేవి చారిటబుల్ అండ్ రీసెర్చ్ ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు సాగిస్తున్న ఆయన ఈ మరమ్మతు పనులకయ్యే ఖర్చు భరించేందుకు ముందుకొచ్చారు. ఏడాది పాటు ఐఐటీ నిపుణులతో అధ్యయనం చేయించారు. వెయ్యేళ్ల క్రితం నాటి పురాతన విధానంతో శాస్త్రీయంగా పనులు చేపట్టాలని నిర్ణయించి బుధవారం పనులు ప్రారంభించారు.


అరేబియన్ వృక్షాల బంక


నానబెట్టిన సున్నం


నానబెట్టిన బెల్లం, కరక్కాయ పొడి

ఎలా చేస్తారంటే..

సిమెంటు, ఆధునిక రసాయన లీకేజీ ప్రూఫ్‌లు మరమ్మతు పనుల్లో వాడకూడదని నిర్ణయించుకున్నారు. వెయ్యేళ్ల క్రితం నిర్మాణాలు జరిగిన పద్ధతిలోనే ఒక మిశ్రమం తయారు చేసుకుంటున్నారు. సున్నం, బెల్లం, కరక్కాయ పొడి, కాల్చిన మట్టి, ఇటుక ముక్కలు, ఇటుకల పొడితో పాటూ అరబ్బు దేశాల నుంచి దిగుమతి చేసుకున్న బంక (ఆ ప్రాంతపు చెట్ల నుంచి సేకరించేది) వాడుతున్నారు.వేర్వేరు డ్రమ్ముల్లో వీటిని నానబెట్టుకున్నాక సమపాళ్లలో ఇసుకతో కలిపి ఒక మిశ్రమం సిద్ధం చేసుకుంటున్నారు. పూణె నుంచి వచ్చిన నిపుణులైన కార్మికులు ఆలయం పైకప్పుపై ఈ పనులను చేస్తున్నారు. పనులు పూర్తయ్యేందుకు నెలరోజులు పడుతుందని అంచనా. ఆలయ అధికారులు వీరికి సహకరిస్తున్నారు.

గేట్లు తెరిచి దారివ్వండి


పెద్దిరెడ్డి ఇంటి సమీపంలో బుధవారం కూడా మూసివున్న గేట్లు

- హైకోర్టు ఆదేశం
- అయినా లెక్కచేయని పెద్దిరెడ్డి

తిరుపతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి నగరంలో మారుతీనగర్, రాయల్‌నగర్ మెయిన్‌రోడ్లను కలుపుతూ నిర్మించిన సిమెంట్ రోడ్డుకు ఇరువైపులా ఏర్పాటు చేసిన గేట్లను మూసివేయవద్దని, సామాన్య ప్రజల రాకపోకలకు అవరోధం కల్పించవద్దని మాజీ మంత్రి పెద్దిరెడ్డి కుటుంబ సభ్యులను హైకోర్టు ఆదేశించింది. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ వేసిన రోడ్లకు పెద్దిరెడ్డి తన ఇంటి ముందు సామాన్య ప్రజలు ఎవరూ రాకపోకలు సాగించకూడదని రెండు వైపులా గేట్లను ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే.ఈ గేట్లను ఓపెన్ చేసి రెండు కాలనీలకు రాకపోకలు కల్పించాలని హైకోర్టు ఆదేశించినా ఇప్పటికీ గేట్లు తెరవకపోవడం విమర్శలకు తావిస్తోంది.దీని పూర్వాపరాలు పరిశీలిస్తే...కార్పొరేషన్ రోడ్డుకు పెద్దిరెడ్డి గేట్లు ఏర్పాటుచేసుకోవడంపై మీడియాలో కథనాలు రావడంతో మూడు వారాల క్రితం పెద్దిరెడ్డి ఇంటిముందు జనసేన నేత కిరణ్ రాయల్ ధర్నాకు దిగిన నేపథ్యంలో వివాదం రోడ్డెక్కింది. ఈ క్రమంలో ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు మున్సిపల్ అధికారులను నివేదిక కోరారు. స్థానిక 18వ డివిజన్లోని మారుతీనగర్-రాయల్ నగర్‌ను కలిపేందుకు సీసీ రోడ్డు వేస్తున్నట్టు రూ9.55లక్షల అంచనాతో (ఐఎఫ్‌బి నెం45/19-20)ఒకటి, రూ9.50 లక్షలతో (ఐఎఫ్‌బి నెం.46/19-20)లతో మరొకటి రెండు విడతలుగా నామినేటెడ్ కింద టెండరిచ్చినట్టు అధికారులు గుర్తించారు.స్థానికుల విజ్ఞప్తి మేరకు రాయల్ నగర్ నుంచి మారుతీనగర్‌ను కలుపుతూ రోడ్డు వేస్తున్నట్టు కార్పొరేషన్ రికార్డులో నమోదు చేసిన విషయాన్ని కూడా నిర్ధారించారు.అయితే ఈలోపు పెద్దిరెడ్డితో పాటు ఆయన కుటుంబ సభ్యులు ఈనెల 8న హైకోర్టును ఆశ్రయించారు.సంబంధిత స్థలంలో నిర్మించిన సిమెంట్ రోడ్డును, రక్షణ కోసం నిర్మించిన గేటును తొలగించకుండా ఉత్తర్వులు జారీచేయాలని కోరారు. తమ భద్రతను దృష్టిలో పెట్టుకుని అప్పట్లో కార్పొరేషన్ నిధులతో సీసీ రోడ్డు నిర్మించారని, అందుకైన ఖర్చుకూడా తాము చెల్లించేందుకు సిద్ధంగా ఉన్నామని అభ్యర్థించారు. కార్పొరేషన్ తరపున కూడా ఓ నివేదికను కోర్టుకు సమర్పించారు.ఈ వివరాలను పరిగణనలోకి తీసుకున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కృష్ణమోహన్..పిటీషనర్ల ఆస్తుల విషయంలో ఏవైనా చర్యలు తీసుకోవాలని భావిస్తే చట్ట నిబంధనల ప్రకారం నడుచుకోవాలని అధికారులకు మధ్యంతర ఉత్తర్వులు ఇస్తూ ఈనెల 10వ తేదీకి కేసును వాయిదా వేశారు.ఇంతవరకు పెద్దిరెడ్డికి అనుకూలమైన తీర్పువచ్చినప్పటికీ 10వ తేదీ ప్రభుత్వ న్యాయవాది రిట్ పిటీషన్ దాఖలు చేశారు.ప్రజా రవాణాకు ఇబ్బంది కలగకుండా,గేట్లు మూసివేయకుండా చూడాలని 8వ తేదీ ఇచ్చిన ఉత్తర్వును సవరిస్తూ హైకోర్టు స్పష్టంగా మధ్యంతర ఉత్తర్వులిచ్చింది. ప్రతివాదులకు కౌంటర్ అఫిడవిట్‌ను దాఖలు చేయడానికి కేసును 4 వారాలకు వాయిదా వేసింది. పిటీషనర్ల ఆస్తికి ఏదైనా ముప్పు ఉన్నట్లైతే, అవసరమైన రక్షణ కోసం సంబంధిత అధికారులకు దరఖాస్తు చేసుకోవచ్చని సూచించింది.చట్టనిబంధనలను అనుసరించి దరఖాస్తుపై నిర్ణయం తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేసింది. పిటిషనర్ల ప్రైవేటు ఆస్తి వ్యవహారంలో ఎలాంటి తొందరపాటు, బలవంతపు చర్యలు తీసుకోవద్దని కార్పొరేషన్ అధికారులను ఆదేశిస్తూ గతంలో ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సవరించింది.ఈ నేపథ్యంలో హైకోర్టు ఆదేశాల మేరకు తదుపరి తీర్పు వచ్చేవరకు పెద్దిరెడ్డి ఇంటి ముందు రెండు కాలనీలకు దారి కల్పించాలని ఈనెల 15న మున్సిపల్ కార్పొరేషన్‌కు ఉత్తర్వులు అందాయి.అయితే ఇప్పటికీ ఆయన గేట్లు తెరిచివుంచకపోవడంతో కార్పొరేషన్ యంత్రాంగం అటువైపు వెళ్లేందుకు కూడా సాహసించకపోవడం విమర్శలకు తావిచ్చింది. బుధవారం బాధ్యతలు తీసుకున్న కొత్త కమిషనర్ అయినా ఆ దిశగా చర్యలు తీసుకుంటారో లేదో చూడాలి.

అమృత్ భారత్‌కు పది రైల్వే స్టేషన్ల ఎంపిక



తిరుపతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): బడ్జెట్‌లో కేంద్ర ప్రభుత్వం తిరుపతి, ఉమ్మడి చిత్తూరు జిల్లా పరిధిలో ఏకంగా పది రైల్వే స్టేషన్లకు తీపి కబురు ప్రకటించింది. అమృత్ భారత్ స్టేషన్ పథకం కింద ఈ రెండు జిల్లాల పరిధిలో మొత్తం పది రైల్వే స్టేషన్లను ఎంపిక చేసింది. తిరుపతి, రేణిగుంట, పాకాల , చిత్తూరు, శ్రీకాళహస్తి, మదనపల్లె రోడ్డు, పీలేరు, కుప్పం,గూడూరు, సూళ్ళూరుపేట స్టేషన్లు అవకాశం దక్కించుకున్నాయి. కాగా రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 73 రైల్వే స్టేషన్లను కేంద్రం ఎంపిక చేయగా అందులో ఈ ప్రాంతానివే పది స్టేషన్లు వుండడం గమనార్హం. అమృత్ భారత్ పథకం కింద ఇపుడున్న రైల్వే స్టేషన్లను పూర్తి స్థాయిలో తిరిగి అభివృద్ధి పరచనున్నారు. అత్యాధునిక సాంకేతిక సదుపాయాలు, హంగులతో వీటిని తీర్చిదిద్దే అవకాశముంది. అయితే స్టేషన్ల వారీ అభివృద్ధికి కేటాయించిన నిధుల వివరాలు ఇంకా వెల్లడి కాలేదు. కొన్నేళ్ళ కిందటే ఈ ప్రాంతంలోని రైల్వే స్టేషన్లను ఆధునికీకరించిన సంగతి తెలిసిందే. తాజాగా కేంద్రం అమృత్ పథకం కిందకు వీటిని చేర్చడంతో ఆధునికీకరణ, అభివృద్ధి పరంగా ఈ స్టేషన్లు మరో అడుగు ముందుకు వేయనున్నాయి. ఎంపికైన స్టేషన్లను పరిశీలిస్తే తిరుపతి, శ్రీకాళహస్తి స్టేషన్లు పుణ్యక్షేత్రాల కేటగిరీలో వుండగా గూడూరు, రేణిగుంట, పాకాల స్టేషన్లు జంక్షన్ కేంద్రాలుగా వున్నాయి. సూళ్ళూరుపేట తమిళనాడు సరిహద్దుల్లోనూ, కుప్పం కర్ణాటక సరిహద్దుల్లోనూ కీలక స్టేషన్లు. చిత్తూరు జిల్లా కేంద్రంతో పాటు తమిళనాడు సరిహద్దుల్లో కీలక స్టేషన్ కాగా పీలేరు ఉమ్మడి చిత్తూరు జిల్లా నడిబొడ్డున ముఖ్యమైన స్టేషన్‌గా ఆవిర్భవించిన సంగతి తెలిసిందే. వీటి ప్రాధాన్యతను బట్టే అమృత్ పథకం పరిధిలోకి వీటిని కేంద్ర ప్రభుత్వం చేర్చినట్టు భావించాల్సి వస్తోంది. ఈ స్టేషన్ల దశ సమీప భవిష్యత్తులో సమూలంగా మారనుంది.


కలెక్టర్ వెంకటేశ్వర్‌తో జేసీ శుభం బన్సల్

జేసీ బాధ్యతల స్వీకారం

తిరుపతి(కలెక్టరేట్), జూలై 24: తిరుపతి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా శుభం బన్సల్ బుధవారం కలెక్టరేట్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవారి పాదాల చెంత జేసీగా రెండవ సారి పని చేసే అవకాశం రావడం అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ప్రభుత్వ ప్రాధాన్యత అంశాలను సమర్థవంతంగా అమలు చేయడానికి కృషి చేస్తామన్నారు. జేసీగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం శుభం బన్సల్ కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.కాగా శుభం బన్సల్‌ను డీఆర్వో పెంచలకిషోర్, కలెక్టరేట్ ఏవో జయరాములు, పలువురు జిల్లా అధికారులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.


మేయర్ శిరీషతో కమిషనర్ మౌర్య

తాగునీటి సమస్య పరిష్కారానికే తొలి ప్రాధాన్యం

- కమిషనర్ మౌర్య

తిరుపతి, జూలై24(ఆంధ్రజ్యోతి): తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, స్మార్ట్ సిటీ ఎండీగా నారపు రెడ్డి మౌర్య బుధవారం ఉదయం నగరపాలక సంస్థ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ కౌన్సిల్ సహకారంతో అధికారులను, సిబ్బందిని సమన్వయం చేసుకుంటూ తిరుపతి నగరాభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ప్రజా సమస్యలపై వచ్చే ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించేలా చర్యలు తీసుకుంటామన్నారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం అన్ని విభాగాల అధిపతులతో సమావేశమయ్యారు.తిరుపతి నగరాభివృద్ధికి కలిసికట్టుగా సమన్వయంతో పని చేద్దామని సూచించారు.కమిషనర్ మౌర్యకు అధికారులు, పలువురు కార్పొరేటర్లు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సమావేశంలో ఏడీసీ చరణ్ తేజ్ రెడ్డి, డీసీ అమరయ్య, ఎస్ఈ మోహన్, ఎంహెచ్‌వో డాక్టర్ యువ అన్వేష్ రెడ్డి, మున్సిపల్ ఇంజనీర్లు చంద్రశేఖర్, వెంకట్రామిరెడ్డి, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, కె.ఎల్.వర్మ, సెక్రటరీ రాధిక, మేనేజర్ చిట్టిబాబు, అడిషనల్ సిటీ ప్లానర్ బాలసుబ్రమణ్యం, వెటర్నరీ ఆఫీసర్ నాగేంద్ర రెడ్డి, మెప్మా కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం మేయర్ డాక్టర్ శిరీషను కమిషనర్ మర్యాదపూర్వకంగా కలిశారు.

ఐదేళ్ల భూబాగోతం సిద్ధం


భూవివరాలు అందించేందుకు జేసీ ఛాంబర్ వద్ద వేచివున్న తహసీల్దార్లు

- నిషేధిత, ఫ్రీ హోల్డ్, ఇనామ్, ఎస్టేట్ భూముల వివరాల సేకరణ
- నేడు మదనపల్లెలో ఉమ్మడి జిల్లా అధికారుల సమావేశం

చిత్తూరు, ఆంధ్రజ్యోతి/ చిత్తూరు కలెక్టరేట్, జూలై 24: మదనపల్లె సబ్ కలెక్టర్ కార్యాలయానికి నిప్పు ప్రభావం మన జిల్లా మీదా పడింది. ఉమ్మడి జిల్లాగా ఉన్నప్పుడు మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో కుప్పం, పలమనేరు, పుంగనూరు నియోజకవర్గాలు ఉన్న విషయం తెలిసిందే. దీంతో మదనపల్లె ఘటనలో విచారణ బాధ్యతను చిత్తూరు కలెక్టర్ సుమిత్‌కుమార్‌కూ కొంత మేర అప్పగించారు. ఇక ఉమ్మడి జిల్లాలో భూముల వివరాలపై రెవెన్యూ శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ సిసోడియా గురువారం మదనపల్లెలో ఉమ్మడి జిల్లా పరిధిలోని తహసీల్దారు, చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల కలెక్టర్లు, ఆర్డీవోలతో సిసోడియా సమావేశం ఏర్పాటు చేశారు. దీనికోసం వైసీపీ ఐదేళ్ల పాలనలో జరిగిన భూబాగోతాలను కలెక్టర్ ఆధ్వర్యంలో వివరాలు సేకరించారు. వీటిని ప్రభుత్వం పంపిన ప్రొఫార్మాలో నింపి బుధవారం జేసీ శ్రీనివాసులుకు అందించారు. మండలాలవారీగా ఐదేళ్లలో 22(ఏ) నిషేధిత జాబితా నుంచి ఎంత భూమిని తొలగించారు.. ఎంత మేర డీకేటీ భూమిని ఫ్రి హోల్డ్ కిందికి మార్చారు.. అలాగే ఈనామ్, ఎస్టేట్, సెటిల్‌మెంట్, ఎండోమెంట్ ల్యాండ్స్ విషయంలో ఏం జరిగింది.. ఎంత మేర ల్యాండ్ కన్వర్షన్ చేశారు.. వంటి సమగ్ర వివరాలను మంగళ, బుధవారాలు తయారు చేశారు. ఈ వివరాలతో గురువారం నాటి సమావేశానికి హాజరుకానున్నారు.

- అలాగే, గత ఐదేళ్లలో అసైన్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పైనా ఈ సమావేశంలో సిసోడియా సమీక్షించనున్నారు. దీనికోసం గ్రామాలవారీగా రిజిస్ట్రేషన్ల వివరాలను ఈ రెండు రోజులపాటు జిల్లా రిజిస్ట్రార్ శ్రీనివాసరావు సేకరించారు. మదనపల్లెలో జరిగే ఈ సమావేశంలో జిల్లా రిజిస్ట్రార్‌తో పాటు 13మంది సబ్‌రిజిస్ట్రార్లు పాల్గొననున్నారు.

పాలిటెక్నిక్ సీట్లకు 31నుంచి స్పాట్ అడ్మిషన్లు

అమరావతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): పాలిటెక్నిక్‌లలో మిగిలిపోయిన సీట్లను స్పాట్ అడ్మిషన్ల ద్వారా భర్తీ చేయనున్నట్లు సాంకేతిక విద్యాశాఖ డైరెక్టర్ గుమ్మల గణేష్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27న ఖాళీ సీట్ల జాబితాను ప్రదర్శిస్తారని, 31 నుంచి అడ్మిషన్ల భర్తీ ప్రక్రియ ప్రారంభమవుతుందని వివరించారు.

కార్యకర్తల కష్టాన్ని ఏనాడూ మరచిపోము

- టీడీపీ శ్రేణుల సమావేశంలో నారా భువనేశ్వరి

కుప్పం, జూలై 24: 'కుప్పం మున్సిపాలిటీ అభివృద్ధికి సీఎం చంద్రబాబు రూ.250 కోట్ల గ్రాంటు ఇవ్వనున్నారు. ఈ నిధులతో పట్టణం సమగ్రాభివృద్ధి చెందుతుంది' అని సీఎం చంద్రబాబు సతీమణి, ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. కుప్పంలోని పీఈఎస్ ఆడిటోరియంలో బుధవారం ఉదయం టీడీపీ నేతలు, కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లతో ఆమె సమావేశమయ్యారు. కార్యకర్తల కష్టాన్ని చంద్రబాబు కానీ, తాను, లోకేశ్ కానీ ఏనాడూ మరచిపోలేదన్నారు. వైసీపీ అయిదేళ్ల పాలనలో కార్యకర్తలు చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారని, పార్టీకోసం తమ జీవితాలను త్యాగం చేశారని చెప్పారు. కష్టపడిన ప్రతి కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుందన్నారు. మున్సిపల్ ఎన్నికల్లో పెద్దిరెడ్డి సృష్టించిన అరాచకాలకు, అన్యాయాలకు కార్యకర్తలు భయపడిపోయారని క్లస్టర్ ఇన్‌చార్జి పీజీ ప్రతాప్ చెప్పారు.అయితే ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ ఇచ్చిన ధైర్యంతో తేరుకుని, బూత్‌లవద్ద ధైర్యంగా నిలబడి చంద్రబాబుకు విజయం సాధించిపెట్టామని చెప్పారు.


కార్యకర్తల మాటలు ఆలకిస్తున్న భువనేశ్వరి

బాబుపై బురద చల్లేందుకే జగన్ ధర్నా

గాంధీ వేషధారణలో అంబేడ్కర్ విగ్రహం ముందు టీడీపీ కార్యకర్త నిరసన


నిరసన తెలుపుతున్న దామోదర నాయుడు

చంద్రగిరి, జూలై 24 : ముఖ్యమంత్రి చంద్రబాబుపై బురద చల్లేందుకే వైసీపీ అధినేత జగన్ ఢిల్లీలో ధర్నా చేపట్టారని టీడీపీ కార్యకర్త కొమ్మినేని దామోదర నాయుడు ఆరోపించారు. జగన్ చేపట్టిన ధర్నాను నిరసిస్తూ బుధవారం దానా మూర్తిపల్లెకు చెందిన దామోదరనాయుడు గాంధీ వేషధారణతో చంద్రగిరి టవర్ క్లాక్ వద్ద అంబేడ్కర్ విగ్రహం ముందు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వ హయాంలో సామాన్యప్రజలపై జరిగిన దౌర్జన్యాలు, దాడులు, హత్యలు ఎవరూ మరిచిపోలేదన్నారు. అయితే ఓడిపోగానే తన దురాగతాలన్నింటినీ ప్రజలు మరిచిపోయి వుంటారనుకుని ఢిల్లీలో ధర్నా చేపట్టి, రాష్ట్రపతి పాలన కోరడం విడ్డూరంగా ఉందన్నారు. ఏపీలో రావణాసురుడి పాలన పోయి, రాముడి పాలన వచ్చిందని జగన్ తెలుసుకోవాలన్నారు.2029లో కూడా యువనేత నారా లోకేష్ ఆధ్వర్యంలో టీడీపీ ప్రభంజనం సృష్టిస్తుందని తెలిపారు.దామోదర నాయుడికి జనసేన, బీజేపీ నాయకులు సంఘీభావం తెలిపారు.

ఐపీ పెట్టిన జర్నలిస్టు ఇంటి వద్ద బాధితుల ఆందోళన

తిరుపతి(నేరవిభాగం), జూలై 24 : తిరుమలలో ఓ పత్రిక రిపోర్టర్‌గా పని చేస్తున్న మనోహర రెడ్డి రుణబాధలు తట్టుకోలేక ఐపీ పెట్టాడని సమాచారం. గతంలో తిరుపతిలో కూడా పని చేసిన ఆయన రియల్ ఎస్టేట్ వ్యాపారంలో నష్టపోయినట్లు చెబుతున్నారు. చేసిన కోట్లాది రూపాయల అప్పులు తీర్చలేక బుధవారం ఐపీ దాఖలు చేశాడు.ఈ విషయం తెలిసిన అప్పులిచ్చినవాళ్లు బుధవారం రాత్రి అతడి ఇంటివద్దకు వెళ్లి ఆందోళనకు దిగారు.ఈ విషయమై ఎస్వీయూ పోలీసులను అడగ్గా తమకెలాంటి ఫిర్యాదు అందలేదని చెప్పారు.

ఎర్రచందనం స్వాధీనం



చంద్రగిరి, జూలై 24: శేషాచలం అటవీ ప్రాంతంలో టాస్క్‌ఫోర్సు సిబ్బంది కూంబింగ్ చేపడుతుండగా రూ.6 లక్షల విలువైన ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. పరారైన స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. భాకరాపేట ఎఫ్‌ఆర్వో దత్తాత్రేయకు అందిన రహస్య సమాచారం మేరకు బుధవారం నాగపట్ల ఈస్ట్ బీట్‌లో కూంబింగ్ చేస్తుండగా, ఈతగుంట వద్ద కొంతమంది స్మగ్లర్లు ఎర్రచందనం దుంగలను మోసుకొస్తూ టాస్క్‌ఫోర్సు సిబ్బందికి తారసపడ్డారు. దీంతో వారిని పట్టుకోవడానికి ప్రయత్నించగా, ఎర్రచందనం దుంగలను పడేసి, అడవుల్లోకి పరారయ్యారు. ఆప్రాంతంలో ఏడు ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకుని, పరారైన స్మగ్లర్ల కోసం గాలింపు చర్యలు చేపట్టారు. స్వాధీనం చేసుకున్న ఎర్రచందనం దుంగలు విలువ రూ.6 లక్షల రూపాయలు ఉంటుందని అటవీ అధికారులు తెలిపారు. ఈ కూబింగ్‌లో డీఆర్వో వేణు, ఎఫ్‌బీవోలు రవి, రెడ్డప్ప, బేస్ క్యాంప్ ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

ఎస్బీఐ ఉద్యోగుల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న ఎస్బీఐ ఉద్యోగులు

తిరుపతి అర్బన్, జూలై 24: స్థానిక తిలక్‌రోడ్డు, గాంధీరోడ్డులలో ఎస్బీఐ ఉద్యోగులు బుధవారం రోడ్లలో వ్యాపారాలు కలిగి వున్న ఖాతాదారులకు, వ్యాపారులకు బ్యాంకు అందిస్తున్న సేవలపై అవగాహన కల్పించారు. వివిధ రుణాలకు సంబంధించిన వివరాలతో కూడిన కరపత్రాలను పంపిణీ చేశారు. సర్కిల్ జనరల్ మేనేజర్ రాజేష్‌కుమార్‌పటేల్, సీజీఎం సీసీ ముంబై ఎ.ఎస్.పాల్, జీఎం సంజయ్‌కుమార్, డీజీఎం లేఖామీనన్ తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో అనుకున్నది సాధించవచ్చు


విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 24: క్రమశిక్షణతో విద్యను అభ్యసిస్తే అనుకున్న లక్ష్యాలను సాధించగలుగుతారని విద్యార్థులకు కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. 10వ తరగతిలో ఎక్కువ మార్కులు సాధించిన విద్యార్థులకు ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించడానికి క్రెడిట్ యాసెస్ గ్రామీణ్ లిమిటెడ్ కంపెనీ సంస్థ ఆర్థిక సాయం అందజేసింది. బుధవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్ చేతులమీదుగా ప్రతిభ కనబరచిన పలువురు విద్యార్థులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. ఒక్కో విద్యార్థికి రూ.15వేలు బ్యాంకులో నగదు డిపాజిట్ చేసినట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

పెరటికోళ్ల పెంపకంతో అదనపు ఆదాయం


బ్రోచర్ ఆవిష్కరిస్తున్న శ్రీలత, సుజాత తదితరులు

తిరుపతి రూరల్, జూలై 24: పెరటికోళ్ల పెంపకం ద్వారా కుటుంబానికి అదనపు ఆదాయం సమకూరుతుందని ఎస్వీవెటర్నరీ వర్సిటీ డైరెక్టర్ ఆఫ్ ఎక్స్‌టెన్షన్ (డీఈ) ప్రొఫెసర్ సీహెచ్ శ్రీలత పేర్కొన్నారు. వర్సిటీలోని నిరంతర పశువైద్యవిద్య, సమాచార కేంద్రం ఆధ్వర్యంలో నార్మ్(ఐసీఏఆర్)ఆర్థిక సౌజన్యంతో పెరటికోళ్ల పెంపకంపై మహిళా రైతులకు నిర్వహించిన మూడ్రోజుల నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమం బుధవారం ప్రారంభమైంది. ముఖ్యఅతిథిగా వచ్చిన శ్రీలత మాట్లాడుతూ...పెరటికోళ్లకు మంచి డిమాండ్ ఉందని,దీన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. సీసీవీఈసీ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ డాక్టర్ సుజాత కోళ్లపెంపకంపై అవగాహన కల్పించారు. నార్మ్ ప్రధానశాస్త్రవేత్త డాక్టర్ ఎం.బాలక్రిష్ణన్, డాక్టర్ ఎస్.షకీల, డాక్టర్ తిరుపతిరెడ్డి, డాక్టర్ కె.జయశ్రీ పాల్గొన్నారు.

ఆరు కిలోల గంజాయి పట్టివేత

గూడూరు,జూలై24: అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపు లోకి తీసుకుని అతని నుంచి 6కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఏఈఎస్ జె.రమేష్ తెలిపారు. బుధవారం స్థానిక సెబ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... చిల్లకూరు మండలం బూదనం టోల్‌ప్లాజా వద్ద బుధవారం వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఈ సమయంలో ఒడిశా రాష్ట్రం కోరపల్లికి చెందిన నందసాహు అనే వ్యక్తి ఓ బ్యాగ్‌పట్టుకుని అనుమానస్పదంగా తిరుగుతున్నాడన్నారు. దీంతో అతన్ని ఆపి బ్యాగ్‌ను సోదా చేయగా రూ.30వేల విలువైన ఆరు కిలోల గంజాయి ఉండడంతో స్వాధీనం చేసుకుని నందసాహును అరెస్ట్ చేశామన్నారు. ఇతను చెన్నైలోని రెడ్‌హిల్స్‌లో ఓ హోటల్‌లో పనిచేస్తూ ఒడిశా గంజాయిని చెన్నైకు తరలించి విక్రయిస్తాడని విచారణలో తేలిందన్నారు. ఎస్ఈబీ సీఐ ఎం.రమేష్, ఎస్ఐలు మోసెస్, విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య



తిరుచానూరు, జూలై 24: తిరుచానూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామినేడు ఇందిరమ్మ హౌసింగ్ కాలనీ సమీపంలో ముళ్ల చెట్లలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన బుధవారం రాత్రి వెలుగు చూసింది. సీఐ శ్రీకాంత్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని రుయా మార్చురీకి తరలించారు. మృతుడి కుడిచేతిపై రేఖ అనే పచ్చబొట్టు, చొక్కాపై ఈగల్ టైలర్ షాప్ కమ్మనహల్లి, బెంగళూరు అని ఉంది. ఈ వ్యక్తికి సుమారు 45 సంవత్సరాల వయసు ఉంటుందని పోలీసుల తెలిపారు. మృతుడి ఆనవాళ్ల కోసం తిరుచానూరు పోలీసులను సంప్రదించాలని సీఐ తెలిపారు.

ఆకట్టుకున్న నాటకాలు

తిరుపతి (కల్చరల్), జూలై 24: శ్రీకాళహస్తీశ్వర మాహాత్మ్యం పద్యనాటకం మహతిలోని ప్రేక్షకులను అలరించింది. తిరుపతికి చెందిన అభినయ ఆర్ట్స్ వారి 24వ వార్షికోత్సవం సందర్భంగా భారత ప్రభుత్వ సాంస్కృతిక శాఖ, కొత్త ఢిల్లీ, ఆంధ్ర రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక శాఖ, అమరావతి, టీటీడీ సంయుక్త నిర్వహణలో హనుమ అవార్డ్స్ పోటీలలో భాగంగా ఐదవ రోజు బుధవారం మధ్యాహ్నం 3.30 గంటలకు కళాసాగర్ నాటక సంక్షేమ సేవా సంఘం, రాజాం, విజయనగరం జిల్లా రంగస్థల కళాకారులు శ్రీకాళహస్తీశ్వర మహత్మ్యం (భక్తకవి నక్కీరునికథ) పద్యనాటకాన్ని ప్రదర్శించగా, ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నృత్యపోటీలు నిర్వహించారు. ఇందులో పాల్గొన్న కళాకారులను నిర్వాహకులు సత్కరించారు. సాయంత్రం 6.30 గంటలకు శ్రీకృష్ణ తెలుగు థియేటర్ ఆర్ట్స్ గుడివాడ వారి మళ్లీ కలిసి జీవిద్దాం అనే సాంఘిక నాటిక, రాత్రి 7.45 గంటలకు తెలుగు కళాసమితి విశాఖ వారి నిశ్శబ్దమా నీ ఖరీదెంత అనే సాంఘిక నాటిక ప్రదర్శించారు.

నేటి కార్యక్రమాలు: నేడు గురువారం ఉ. 9.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు వివిధ విభాగాలలో నృత్యపోటీలు జరుగుతాయి.మధ్యాహ్నం 3.30గంటలకు నవజ్యోతి కళానిలయం జడ్చర్ల వారి మైరావణ పద్యనాటకం, సాయంత్రం 6.30 గంటలకు భక్తరామదాసు ఏకపాత్ర (నటుడు జి.కె.సుందరం) ఉంటాయి. రాత్రి 7 గంటలకు సిరిమువ్వ కల్చరల్స్, హైదరాబాదు వారి దారుణం అనే సాంఘిక నాటిక ప్రదర్శిస్తారు.


నృత్య ప్రదర్శన


శ్రీకాళహస్తీశ్వర మహత్మ్యం పద్యనాటకం


మళ్లీ కలిసి జీవిద్దాం


నిశ్శబ్దమా నీ ఖరీదెంత సాంఘిక నాటికలు

ఆదిశేష విశ్రాంతి భవనం వద్ద శ్రీవాణి కౌంటర్ల నిర్మాణం


ఈవో కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన డిజిటల్ బోర్డు

తిరుమల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో శ్రీవాణి ట్రస్టు కౌంటర్‌ను ఆదిశేష విశ్రాంతి భవనం వద్ద ఏర్పాటు చేసేందుకు ప్రయత్నాలు మొదలయ్యాయి. ప్రస్తుతం తిరుమలలోని ఈవో కార్యాలయంలో నాలుగు శ్రీవాణిట్రస్టు కౌంటర్లు ఉన్న విషయం తెలిసిందే. వీటి ద్వారా శ్రీవాణిట్రస్టుకు విరాళాలు ఇచ్చే దాతలకు వీఐపీ బ్రేక్ దర్శనాలను కేటాయిస్తున్నాయి. అయితే ఈవో కార్యాలయంలో ఈ కౌంటర్లు ఉండటంతో ఈవో సమావేశాలతో పాటు ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖల ద్వారా వచ్చే భక్తులకు ఇబ్బందిగా ఉందని గుర్తించిన టీటీడీ అధికారులు ఈకౌంటర్లను మార్చాలని నిర్ణయించారు. తొలుత అత్యంత రద్దీగా ఉండే సీఆర్వోకి ఈ కౌంటర్లను తరలించాలని భావించారు. ఈ ప్రదేశానికి కౌంటర్లను తరలిస్తే ట్రస్టుకు విరాళిచ్చే భక్తులకు ఇబ్బందులు పెరుగుతాయనే విషయాన్ని ప్రస్తావిస్తూ ఇటీవల ఆంధ్రజ్యోతి 'సీఆర్వోకి శ్రీవాణి కౌంటర్లు' పేరిట కథనం ప్రచురించింది. దీనిపై స్పందించిన ఉన్నతాధికారులు ఈవో కార్యాలయానికి ఎగువభాగంలో ఉన్న ఆదిశేష విశ్రాంతి భవనం వద్ద ప్రత్యేకంగా కౌంటర్లు ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. కేవలం శ్రీవాణిట్రస్టుకు విరాళాలు ఇచ్చి దర్శన టికెట్లు పొందే భక్తుల కోసమే ప్రత్యేకంగా కౌంటర్లను ఏర్పాటు చేయనున్నారు. భక్తులు అధిక సమయం క్యూలైన్‌లో వేచి ఉండే అవసరం లేకుండా దాదాపు 8 కౌంటర్లను ఏర్పాటు చేయాలని అధికారులు భావిస్తున్నారు. ప్రసుత్తం రోజుకు 900 టికెట్లను భక్తులకు కేటాయిస్తున్న విషయం తెలిసిందే. ఈక్రమంలో ఇప్పటివరకు ఎన్ని టికెట్లు కేటాయించారు, ఇంకా ఎన్ని టికెట్లు అందుబాటులో ఉన్నాయనే సమాచారం భక్తులు తెలుసుకునేలా డిజిటల్ బోర్డులను కూడా ఏర్పాటు చేయనున్నారు. ప్రస్తుతం దీని ట్రయల్‌రన్‌ను ఈవో కార్యాలయంలో పరిశీలిస్తున్నారు.

వైద్యుల నిర్లక్ష్యంతోనే మృతి చెందాడు

● రుయా అత్యవసర విభాగం ఎదుట ధర్నాచేసిన మృతుడి కుటుంబీకులు

తిరుపతి(వైద్యం), జూలై 24: రుయా వైద్యుల నిర్లక్ష్యంకారణంగానే తమ కుటుంబ సభ్యుడు మరణించాడంటూ ఓ మృతుడి కుటుంబీకులు బుధవారం రుయాలో ధర్నాకు దిగారు. దీంతో కొంతసేపు ఉద్రిక్తత చోటుచేసుకుంది. అయితే వెస్ట్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బాధితులకు సర్దిచెప్పడంతో పరిస్థితి కాస్త సద్దుమణిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. అన్నమయ్య జిల్లా, రెడ్డిపాళెం గ్రామానికి చెందిన కాశప్ప కుమారుడు శ్రీనివాసులు తిరుమల బాలాజీ నగర్‌లో ఉంటున్నారు. బుధవారం ఆయన పాముకాటుకు గురయ్యారు. దీంతో బంధువులు ఆయనను తిరుపతి రుయా ఆసుపత్రికి తీసుకురాగా, చికిత్స పొందుతూ ఆయన మృతిచెందారు. దీంతో వైద్యుల నిర్లక్ష్యం కారణంగానే శ్రీనివాసులు మృతి చెందారంటూ మృతుడి కుటుంబ సభ్యులు రుయా అత్యవసర విభాగం వద్ద బైఠాయించి ధర్నాకు దిగారు. వెస్ట్ పోలీసులు అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. విచారించి న్యాయం చేస్తామనిచెప్పి బాధితులను చల్లబరిచారు. దీంతో పరిస్థితి సద్దుమణిగింది.



పాముకాటుతో మృతి చెందిన శ్రీనివాసులు, రుయాలో ధర్నాచేస్తున్న ఆయన కుటుంబ సభ్యులు

జనరిక్ మందుల దుకాణాల్లో అక్రమాలపై విచారణ జరిపించండి

● స్విమ్స్ డైరెక్టర్ రవికుమార్‌ను కోరిన బీజేపీ


జనరిక్ దుకాణంలో మందులను పరిశీలిస్తున్న భానుప్రకాష్‌రెడ్డి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 24: స్విమ్స్‌లోని జనరిక్ మందుల దుకాణాల్లో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు స్విమ్స్ డైరెక్టర్ డాక్టర్ రవికుమార్‌ను కోరారు. బీజేపీ నాయకులు భానుప్రకాష్‌రెడ్డి, పొనగంటి భాస్కర్, వరప్రసాద్ తదితరులు బుధవారం స్విమ్స్‌లోని జనరిక్ మందుల దుకాణాలను పరిశీలించారు. అనంతరం డైరెక్టర్ డాక్టర్ రవికుమార్‌ను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... స్విమ్స్‌లో ఏర్పాటుచేసిన జనరిక్ మందుల దుకాణాల్లో జనరిక్ మందులు కాకుండా అధిక ధరలకు ఇతర కంపెనీల మందులను విక్రయిస్తున్నట్టు ప్రజల నుంచి తమకు ఫిర్యాదులు అందాయని చెప్పారు. ఈవిషయంపై విచారణ జరిపించి ఆ దుకాణాల లైసెన్స్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. విచారణ జరిపించి వారంలోగా చర్యలు తీసుకుంటానని స్విమ్స్ డైరెక్టర్ బీజేపీ నాయకులకు చెప్పడంతో వారు వెనుదిరిగారు. బీజేపీ నాయకులు డాక్టర్ నరేష్, ఓబీసీ మోర్చా నాయకులు ప్రేమ్‌కుమార్, బాలభాస్కర్, హేమ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో అమెరికన్లు


రాహుకేతు పూజలు చేసుకుంటున్న అమెరికా దేశస్థులు

శ్రీకాళహస్తి, జూలై 24: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని బుధవారం అమెరికా దేశస్థులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. ముందుగా రాహుకేతు పూజలను చేయించుకుని, అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో అమెరికన్లను వేద పండితులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్రీకాళహస్తీశ్వరాలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందని, స్వామిఅమ్మవార్లను దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు.

బందోబస్తు మధ్య ఉపాధి హామీ సోషల్ ఆడిట్


పోలీస్ పహారాలో చింతగుంట పంచాయతీలో సోషల్ ఆడిట్ నిర్వహిస్తున్న అధికారులు

ఎర్రావారిపాలెం, జూలై 24: మండలంలో 2023-2024 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఉపాధి హామీ పథకం అమలుపై గ్రామస్థాయి సోషల్ ఆడిట్ పోలీసు బందోబస్తు మధ్య జరుగుతోంది. ఇప్పటి వరకు మండలంలో కమ్మయ్యగారిపల్లె, ఎర్రావారిపాలెం, చెరుకువారిపల్లె, ఉదయ మాణిక్యం, బోడేవాండ్ల పల్లె పంచాయతీల్లో సామాజిక తనిఖీలు పూర్తయ్యాయి. బుధవారం చింతగుంట, నెరబైలు పంచాయతీల్లో గ్రా సభలు పోలీసు బందోబస్తు మధ్య జరిగాయి. కోటకాడ పల్లె, ఉస్తికాయల పెంట పంచాయతీల్లో గురువారం జరగనున్నాయి. గత వైసీపీ పాలనలో ఉపాధి హామీ అమలు పక్కదారి పట్టిందని తెలుగు తమ్ముళ్లు ఆరోపించిన విషయం విదితమే. పత్రికల్లో కూడా పలు కథనాలు వచ్చాయి. గతంలో ఎంత మేర అవినీతి జరిగిందో ఆడిట్ అధికారులు త్వరలో తేల్చనున్నారు. గత వైసీపీ పాలనలో ఆడిట్ ఓపెన్ ఫోరంలు జరపకనే జరిగినట్లు కార్యాలయాల్లోనే రికార్డుల నమోదు జరిగింది. ఈనెల 27వ తేదీన మండల కేంద్రంలో ఓపెన్ ఫోరం జరుగనుంది. ఈ సమావేశంలో ఏమేరకు అవినీతి జరిగిందో తేలనుంది.

సప్లై ఛానల్స్ పునరుద్ధరణకు చర్యలు చేపట్టండి

ఎమ్మెల్యే నానీకి పాతకాల్వ గ్రామస్తుల వినతి



తిరుపతి రూరల్, జూలై 24: తిరుపతి రూరల్ మండల పరిధిలో సి.మల్లవరం గ్రామం నుం చి పాతకాల్వ చెరువుకు నీరు వచ్చే సప్లై ఛానల్స్‌ని పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరారు. ఈమేరకు బుధవారం అమరావతిలో ఎమ్మెల్యే పులివర్తి నానీని కలసి విన్నవించామని వారు పేర్కొన్నారు. ఈవిషయమై అసెంబ్లీలో మాట్లాడి త్వరితగతిన చర్యలు చేపట్టాలని కోరినట్లు వారు పేర్కొన్నారు.

అమ్మవారి సేవలో మేఘాలయ హైకోర్టు సీజే



తిరుచానూరు, జూలై 24: తిరుచానూరు పద్మావతి అమ్మవారిని బుధవారం మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎస్.వైద్యనాథన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. డిప్యూటీ ఈవో గోవిందరాజన్, అర్చకులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు.

తిరుమలలో ఘనంగా పల్లవోత్సవం

తిరుమల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో బుధవారం పల్లవోత్సవం ఘనంగా జరిగింది. మైసూరు మహారాజు జయంతిని పురస్కరించుకుని టీటీడీ పల్లవోత్సవాన్ని నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. సహస్రదీపాలంకారసేవ అనంతరం శ్రీదేవి, భూదేవి సమేత శ్రీమలయప్పస్వామి ఊరేగింపుగా కర్ణాటక సత్రానికి వేంచేపు చేశారు. మైసూరు సంస్థానం వారి ఆతిథ్యాన్ని స్వీకరించారు. అనంతరం కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, మైసూరు సంస్థానం ప్రతినిధులు స్వామి, అమ్మవార్లకు ఆహ్వానం పలికి ప్రత్యేక హారతి సమర్పించారు. ప్రత్యేక పూజలు నిర్వహించి, నైవేద్యం సమర్పించి భక్తులకు పంపిణీ చేశారు. ఆలయ పేష్కార్ శ్రీహరి, పడికావలి ఏఈవో మోహన్‌రాజు, ఇతర అధికారులు, కర్ణాటక రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధులు, మైసూరు సంస్థానం ప్రతినిధులు పాల్గొన్నారు.



విద్యుత్ వినియోగదారుల సమస్యలు సత్వర పరిష్కారం


సదస్సులో అర్జీ తీసుకుంటున్న వాసురెడ్డి

తిరుపతి(ఆటోనగర్), జూలై 24: విద్యుత్ వినియోగదారులకు సేవలందించడానికి సర్కిల్ ఎస్ఈ సురేంద్ర నాయుడు ఆదేశాల మేరకు వినియోగదారుల సమస్యల పరిష్కార అదాలత్ ఏర్పాటు చేసినట్లు తిరుపతి టౌన్, రూరల్ డివిజన్ ఈఈలు కె.వాసుదేవరెడ్డి, ఎస్.వాసురెడ్డి తెలిపారు. బుధవారం పాత తిరుచానూరు రోడ్డులో వున్న విద్యుత్ ఈఈ కార్యాలయ ప్రాంగణంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కార సదస్సు నిర్వహించారు. వినియోగదారులు ఇచ్చిన అర్జీలు తీసుకున్నారు. గత సదస్సులో వచ్చిన సమస్యలను పరిష్కరించామని వారు చెప్పారు. ప్రతి బుధవారం ఈ సదస్సును ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు నిర్వహిస్తామని తెలిపారు. డీఈఈ ముని ప్రసాద్, ఏఈలు శ్రీనివాసులు నాయుడు, హేమచంద్రారెడ్డి, శంకర్ రెడ్డి, మునిరామ్ పాల్గొన్నారు.

నూతన యాజమాన్య పద్ధతులు అవలంబించండి


వేరుశనగ పంటను పరిశీలిస్తున్న రాస్ శాస్త్రవేత్తలు

రామచంద్రాపురం, జూలై 24: రైతులు వ్యవసాయంలో నూతన యాజమాన్య పద్ధతులు అవలంబించాలని ఐసీఏఆర్ ప్రధాన శాస్త్రవేత్త ఏఆర్ రెడ్డి సూచించారు. కేవీకే దత్తత గ్రామమైన మిట్టూరులో బుధవారం రాస్ కృషి విజ్ఞానకేంద్రం శాస్త్రవేత్తలు పంట పొలాలను సందర్శించారు. మిట్టూరు గ్రామానికి చెందిన ఆదర్శ రైతు పురుషోత్తమ నాయుడు సమగ్ర వ్యవసాయం ద్వారా సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. మిగిలిన రైతులు కూడా ఇలాంటి పద్ధతులను అవలంభించాలని సూచించారు. శాస్త్రవేత్తలు శ్రీనివాసులు, దివ్య, రామ్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

వైభవంగా అర్జున తపస్సు


తపస్మాన్‌ను అధిరోహిస్తున అర్జున వేషధారి

రామచంద్రాపురం, జూలై 24: పరమాల, బుట్టిరెడ్డి కండ్రిగ, మోటావారి కండ్రిగ మహాభారత ఉత్సవాల్లో భాగంగా బుధవారం అర్జున తపస్సు కార్యక్రమం వైభవంగా జరిగింది. ఆలయంలో మూలమూర్తులకు తిరుమంజనం నిర్వహించి, ప్రత్యేక అలంకరణ చేపట్టారు. మధ్యాహ్నం భాగవతారిణి సుమతి వినిపించిన పాండవ వనవాసం హరికథ సభికులను ఆకట్టుకుంది. అర్జునపాత్రవేషధారి తపస్మాన్ అధిరోహిస్తూ శివుడిని ప్రార్థించే సన్నివేశం ఆకట్టుకుంది. తపస్మాన్ నుంచి విసిరిన పండ్లు, పూలు, నిమ్మకాయలు పట్టుకునేందుకు భక్తులు ఎగబడ్డారు. తపస్మాన్ చుట్టూ తమ కోర్కెలు తీర్చుకునేందుకు భక్తులు ఒరపడ్డారు. ఉభయ దాతలుగా దేశమ్మ, గుర్రప్పరెడ్డి, జ్యోతి వ్యవహరించారు. సాయంత్రం ఉత్సవ మూర్తుల ఊరేగింపు జరిగింది. ఆలయ ధర్మకర్త రమేష్ నాయుడు, సురేంద్ర నాయుడు, జయరామిరెడ్డి, దుర్వాసులు, చంద్రారెడ్డి, రోశిరెడ్డి పాల్గొన్నారు.

హేమంత్‌కు టీడీపీ నేతల నివాళులు



రామచంద్రాపురం, జూలై 24: రేకలచేను గ్రామంలో గుండెపోటుతో మృతి చెందిన టీడీపీ మద్దతుదారుడు హేమంత్ భౌతికకాయానికి మండల టీడీపీ అధ్యక్షుడు తిరుమలరెడ్డి ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు బుధవారం పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. హేమంత్ కుటుంబసభ్యులను పరామర్శించి, పార్టీ అండగా ఉంటుందన్నారు. మాజీ ఎంపీపీ బిందుమాధవి, విజయకుమార్, దేవరాజులురెడ్డి, రమణారెడ్డి, ప్రకాష్ పాల్గొన్నారు.

జాగిలాల పనితీరును పరిశీలించిన ఎస్పీ



తిరుపతి (నేర విభాగం), జూలై 24: ఎర్ర చందనం అక్రమ రవాణా నిరోధక టాస్క్‌ఫోర్స్ జాగిలాల పనితీరును టాస్క్‌ఫోర్స్ ఎస్పీ శ్రీనివాస్ పరిశీలించారు. టాస్క్‌ఫోర్సు కార్యాలయ ప్రాంగణంలో హంటర్, గంగ పేర్లు గల జాగిలాల పనితీరును బుధవారం పరిశీలించారు. ఎస్పీ మాట్లాడుతూ ఎర్రచందనం స్మగ్లర్ల ఆట కట్టించడానికి జాగిలాల సేవలను వినియోగించుకుంటామని తెలిపారు. టాస్క్ ఫోర్సు పరిధిలో తిరుపతిలో రెండు, ఉమ్మడి కడప జిల్లాలో మూడు జాగిలాలను వినియోగించుకుంటామన్నారు. అనుమానిత చెక్ పోస్టులతో పాటు అటవీ ప్రాంతాల్లో ప్రయాణించే వాహనాలను, ఎర్రచందనం డంప్‌లను జాగిలాల ద్వారా తనిఖీ చేస్తామన్నారు. జాగిలాల పనితీరు బాగుందని ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో ఆపరేషన్స్ ఆర్ఐ సురేష్‌కుమార్‌రెడ్డి, జాగిలాల ట్రైనర్లు పాల్గొన్నారు.

ఎస్ఎస్‌డీ టోకెన్ల కౌంటర్లలో తనిఖీలు



తిరుమల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో శ్రీవారి భక్తుల కోసం టీటీడీ కేటాయిస్తున్న స్లాటెడ్ సర్వదర్శనం(ఎస్ఎస్‌డీ) టోకెన్ల కౌంటర్లను టీటీడీ జేఈవో గౌతమి బుధవారం సాయంత్రం తనిఖీ చేశారు. ఈసందర్భంగా జేఈవో శ్రీనివాసంలోని ఎస్ఎస్‌డీ టోకెన్ల జారీ కౌంటర్లు, క్యూలైన్లను పరిశీలించారు. అనంతరం విష్ణునివాసంలోని గదుల కేటాయింపు, ఎస్ఎస్‌డీ టోకెన్ల కౌంటర్లు, క్యూలైన్లను పరిశీలించి భక్తులకు మెరుగైన సేవలందించేందుకు పలు సూచనలు చేశారు. జేఈవోతో పాటు టీటీడీ సీఈ నాగేశ్వరరావు, ట్రాన్స్‌పోర్టు జీఎం శేషారెడ్డి, వీజీవో బాలిరెడ్డి, ఈఈ కృష్ణారెడ్డి, డిప్యూటీఈవోలు పార్వతి, భారతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారికి కానుకగా ఎలక్ట్రిక్ స్కూటర్లు



తిరుమల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారికి బుధవారం రెండు ఎలక్ట్రిక్ స్కూటర్లు విరాళంగా అందాయి. కలకత్తాకు చెందిన మోటోవెల్ట్ సీఈవో తుషార్ చౌదరి బుధవారం రూ.2.45 లక్షల విలువైన ఈ స్కూటర్లను టీటీడీకి విరాళంగా ఇచ్చారు. ఈ వాహనాలకు బుధవారం ఉదయం ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ద్విచక్రవాహన తాళాలను టీటీడీ జేఈవో వీరబ్రహ్మంకు అందజేశారు. టీటీడీ ట్రాన్స్‌పోర్టు తిరుమల డీఐ సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఒకటిన కెమెరాల ఈ-వేలం

తిరుమల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాల్లో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన కెమెరాలను ఆగస్టు 1వ తేదీన రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ-వేలం వేయనున్నారు. ఇందులో నైకాన్, కెనాన్, కొడాక్ తదితర సంస్థల కెమెరాలు ఉన్నాయి. ఉపయోగించినవి, పాక్షికంగా దెబ్బతిన్న కెమెరాలు మొత్తం 10 లాట్లు ఈ-వేలంలో ఉంచారు. ఇతర వివరాల కోసం తిరుపతిలోని మార్కెటింగ్ కార్యాలయాన్ని 0877 2264429 నెంబరును సంప్రదించవచ్చని టీటీడీ తెలిపింది. అలాగే తిరుపతి.ఓఆర్జీ లేదా కొనుగోళ్లు.ఏపీ.జీవోవీ.ఇన్ అనే వెబ్‌సైట్లను కూడా సంప్రదించవచ్చు.

పాలిమారు మఠాధిపతికి టీటీడీ చిన్న మర్యాద





విద్యాధీశతీర్థ స్వామి - క్రికెటర్ ప్రసిద్ కృష్ణ

తిరుమల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): ఉడిపిలోని పాలిమారు మఠాధిపతి విద్యాధీశతీర్థ స్వామి బుధవారం టీటీడీ చిన్నమర్యాదతో శ్రీవారిని దర్శించుకున్నారు. ఆయనకు టీటీడీ జేఈవో వీరబ్రహ్మం, అర్చక బృందం ఇస్తికఫాల్ స్వాగతం పలికారు. అదేవిధంగా తెలంగాణ గవర్నర్ సీపీ రాధాకృష్ణన్, ఇండియన్ క్రికెటర్ ప్రసిద్ కృష్ణ కుటుంబ సమేతంగా శ్రీవారిని దర్శించుకున్నారు. దర్శనం అనంతరం ఆలయం వెలుపలకు వచ్చిన క్రికెటర్‌ను చూసేందుకు, సెల్ఫీలు తీసుకునేందుకు అభిమానులు ఎగబడ్డారు.

బడ్జెట్ కేటాయింపులపై టీడీపీ హర్షం



మాట్లాడుతున్న భాస్కర్‌యాదవ్

తిరుపతి అర్బన్, జూలై 24: కూటమి ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతో కేంద్ర బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్‌కు రూ.15వేల కోట్లు కేటాయింపుపై టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దంపూరి భాస్కర్‌యాదవ్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 33వేల ఎకరాల భూమి సేకరించి అమరావతి చెక్కిన శిల్పి ముఖ్యమంత్రి చంద్రబాబు అని కొనియాడారు. దానిని గత వైసీపీ ప్రభుత్వం సర్వనాశనం చేసిందన్నారు. ఆంధ్రరాష్ట్రానికి రెండు కళ్లు అయిన అమరావతి, పోలవరం నిర్మాణాలకు కేంద్రం నిధులు మంజూరు చేయడాన్ని ప్రధాని మోదీకి అభినందనలు తెలియజేశారు.

ఆప్కో వస్త్రాలపై మెగా రాయితీ

తిరుపతి అర్బన్, జూలై 24: తిరుపతిలోని గాంధీరోడ్డు, టీటీడీ శ్రీనివాసం కాంప్లెక్స్, తిరుమల సప్తగిరి సర్కిల్ వద్దవున్న ఆప్కో దుకాణాలలో అన్ని రకాల వస్త్రాలపై 30నుంచి 50శాతం రాయితీ ఇవ్వనున్నట్లు ఆప్కో డివిజన్ వాణిజ్యాధికారి ఎన్.కోటేశ్వరరావు తెలిపారు. బుధవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. ఈ మెగా రాయితీ వచ్చే ఏడాది సంక్రాంతి వరకు కొనసాగిస్తామన్నారు. ఆషాడం, శ్రావణ మాసాల సందర్భంగా నూతన డిజైన్లతో వస్త్రాలను అందుబాటులో ఉంచామన్నారు. మరిన్ని వివరాల కోసం 90000 83091 నెంబరును సంప్రదించాలని ఆయన కోరారు.







మోహన్ (ఫైల్‌ఫొటో)

తిరుపతిలోని పద్మావతినగర్‌లో బుధవారం సాయంత్రం తన వదినతోపాటు ఆమె ఇద్దరు కూతుళ్లను హత్య చేసిన ఓ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు తాను కూడా ఆత్మహత్యకు పాల్పడడటం స్థానికులను కలవరపరిచింది. పోలీసులు సంఘటన జరిగిన ఇంటిలో సాక్ష్యాలను సేకరించారు. ఎస్పీ సుబ్బరాయుడు తమ్ముడి చేతిలో భార్యాపిల్లలను కోల్పోయిన దాసుతో మాట్లాడి కేసు పూర్వాపరాలను తెలుసుకున్నారు. - తిరుపతి నేరవిభాగం

అన్నప్రసాదాలకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయండి

రైస్ మిల్లర్లను కోరిన టీటీడీ ఈవో



తిరుమల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి దర్శనార్థం తిరుమలకు వచ్చే భక్తులకు అందించే అన్నప్రసాదాల రుచిని పెంచేందుకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని టీటీడీ ఈవో శ్యామలరావు రైస్ మిల్లర్లను కోరారు. టీటీడీకి బియ్యం సరఫరా చేస్తున్న రైస్ మిల్లర్లతో బుధవారం ఈవో తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో సమావేశమయ్యారు. ఈవో మాట్లాడుతూ.. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు బియ్యం సేకరణ సమయంలో నాణ్యత ప్రమాణాలను పెంపొందించానికి సూచనలివ్వాలని కోరారు. తద్వారా టెండర్లను ఆహ్వానించే సమయంలో వాటిని చేర్చవచ్చన్నారు. ఈ క్రమంలో రైస్ మిల్లర్స్ పలు సూచనలుచేశారు. ముఖ్యంగా వెంగమాంబ అన్నప్రసాదంలో వంట పరికరాలు దశాబ్దంన్నర కాలం నాటివి కావడంతో వాటిస్థానంలో అత్యాధునిక యంత్రాలను ఏర్పాటుచేయాలని ఈవో దృష్టికి తీసుకువచ్చారు. ఈవో స్పందిస్తూ త్వరలో వంటశాలలను ఆధునీకరించనున్నట్లు తెలిపారు. జేఈవోలు గౌతమి, వీరబ్రహ్మం, అన్నప్రసాదం డిప్యూటీఈవో రాజేంద్ర, ప్రత్యేకాధికారి శాస్త్రి, ఈఈ ప్రొక్యూర్మెంట్ మురళీకృష్ణ, ఏపీ, తెలంగాణ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఘనంగా జాషువా వర్ధంతి



తిరుపతి (కల్చరల్), జూలై 24: తన రచనలతో దళిత హక్కుల కోసం గళమెత్తిన మహాకవి గుర్రం జాషువా మార్గంలో అందరూ నడవాలని రాయలసీమ రంగస్థలి అధ్యక్షుడు గుండాల గోపీనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం జాషువా వర్ధంతిని పురస్కరించుకుని సంస్థ సభ్యులు ఆయన చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. సభ్యులు కెఎస్ రాజ, టి.సుబ్రమణ్యంరెడ్డి, కన్నప్ప గారి కేశవరెడ్డి, చంద్రబాబు నాయుడు, కె.సుబ్రమణ్యంరెడ్డి, ఫణిభూషణరెడ్డి, మల్లారపు రవిప్రసాద్, విద్వాన్ కస్పాపద్మనాభం పాల్గొన్నారు.

కష్టపడ్డ కార్యకర్తలను గుర్తించండి

టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లాను కోరిన తిరుపతి నేతలు



తిరుపతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): గత ఐదేళ్లుగా వైసీపీ అరాచకాలను ఎదుర్కొని అక్రమ కేసులు పెట్టుకుని, రోడ్డుపైకొచ్చి పోరాటం చేసిన కార్యకర్తలను గుర్తించి, నామినేటెట్ పదవుల్లో కూడా వారికి తగిన ప్రాధాన్యత ఇవ్వాలని తిరుపతి టీడీపీ కార్పొరేటర్ ఆర్సీ మునికృష్ణ ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావును కోరారు. బుధవారం విజయవాడలో పల్లాను తిరుపతి నేతలు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి, శ్రీవారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు. కష్టపడిన నాయకులకు, కార్యకర్తలకు తగిన గుర్తింపు ఉంటుందని ఈసందర్భంగా అధ్యక్షుడు హామీ ఇచ్చినట్లు తెలిసింది. పల్లాను కలిసినవారిలో 35వ డివిజన్ నాయకులు శ్రీధర్, జగన్నాథం 27వ డివిజన్ అధ్యక్షుడు నాగ ప్రతాప్, సుబ్రహ్మణ్యం నాయుడు ఉన్నారు.

నారా లోకేశ్‌ను కలిసిన సుగుణమ్మ



తిరుపతి, జూలై 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌ను తిరుపతి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్‌చార్జి సుగుణమ్మ బుధవారం విజయవాడలో మర్యాదపూర్వకంగా కలిశారు. తిరుపతి అర్బన్ మండలంలోని విద్యాసంస్థలను ఆధునికీకరించాలని ఆమె ఈసందర్భంగా కోరడంతో, ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిసింది.

డాక్టరేట్ ప్రదానం



వెంకటరమణ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 24: ఎస్వీయూ సంస్కృత పరిశోధకుడు బి.వెంకటరమణ డాక్టరేట్ పొందారు. భాగవతంలోని పదవ స్కంధంలోని సాహిత్య దృక్కోణం - ఒక అధ్యయనం అనే అంశంపై విశ్రాంతాచార్యులు మునిరత్నం పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేశారు. ఈ మేరకు సీఈ దామ్లా నాయక్ తెలిపారు.

ఎస్వీయూలో బోధనేతర ఉద్యోగుల బదిలీలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 24: ఎస్వీయూనివర్సిటీలో నలుగురు బోధనేతర ఉద్యోగులను బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు వెలువరించారు. స్పెషల్ సెల్ ఏఏఓ ఎస్.వెంకటరమణను వీసీ ఛాంబర్‌కు బదిలీ చేశారు. లీగల్, ఆర్టీఐ సెల్ సూపరింటెండెంట్ జె.శరవణకుమార్ రిజిస్ట్రార్ ఛాంబర్‌కు బదిలీపై వెళ్లారు. ఎస్వీయూ ఆర్ట్స్ కాలేజీ మెన్ హాస్టల్ సూపరింటెండెంట్ సయ్యద్ రియాజ్ ఆర్టీఐ సెల్‌కు బదిలీ అయ్యారు. ఇంజనీరింగ్ డిపార్ట్‌మెంట్ సూపరిండెంట్ ఎం.ద్వారకనాథ్‌ను ఆర్ట్స్ హాస్టల్‌కు బదిలీ చేశారు. ఈ మేరకు వర్సిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ మాదాల భూపతి నాయుడు ఉత్తర్వులు వెలువరించారు.

27న జాబ్ మేళా

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 24: ఈ నెల 24వ తేదీన ఎస్వీయూలో జాబ్ మేళా నిర్వహించనున్నారు. అమెజాన్, రిలయన్స్ రిపోర్స్ ఇన్సూరెన్స్ కంపెనీ, ర్యాండ్ స్టాండ్ కంపెనీలు ఈ మేళాలో పాల్గొంటాయి. టెన్త్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, బీఎస్సీ నర్సింగ్, బీఎస్సీ ఎంఎల్‌టీ చదువుకున్న వారు అర్హులు. ఉదయం 10 గంటలకు శ్రీనివాసా ఆడిటోరియం ఎదురుగా గల ఎంప్లాయిమెంటు కార్యాలయంలో సుమారు 850 ఖాళీ పోస్టులకు మేళా చేపట్టనున్నారు. సమగ్ర సమాచారం కోసం.. 95338 89902 నెంబరులో సంప్రదించాలని వర్సిటీ మీడియా కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ పీసీ వెంకటేశ్వర్లు తెలిపారు.

కూటమితోనే రాష్ట్రాభివృద్ధి

తిరుపతి(ఉపాధ్యాయనగర్), జూలై 24: కూటమి ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమౌతుందని బీజేపీ సీనియర్ నేత జల్లి మధుసూదన్ పేర్కొన్నారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఏపీకి నిధుల కేటాయింపే స్పష్టమైన ఉదాహరణ అని పేర్కొన్నారు. ఏపీ రాజధాని అమరావతి నిర్మాణానికి రూ.15 వేల కోట్లు కేటాయించడం శుభపరిణామని, ఇంకా పోలవరం నిర్మాణ బాధ్యతలు కేంద్రం తీసుకోవడం, రాష్ట్రంలో వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేకంగా నిధుల కేటాయింపు జరిపినందుకు, విశాఖ - చెన్నై కారిడార్‌కు అభివృద్ధికి నిర్ణయించినందుకు ప్రధాని మోదీ, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్‌కు మధుసూదన్ కృతజ్ఞతలు తెలిపారు.

పన్ను చెల్లింపులపై అవగాహన పెంపొందించుకోవాలి

ఆదాయ పన్ను శాఖ కమిషనర్ దుర్గేష్ సామ్రాట్



మాట్లాడుతున్న దుర్గేష్ సామ్రాట్

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 24: పన్ను చెల్లింపుదారులు ఆదాయ పన్ను చెల్లింపునకు సంబంధించిన అవగాహనను పెంపొందించుకోవాలని ఆదాయ పన్ను శాఖ ప్రిన్సిపల్ కమిషనర్ దుర్గేష్ సామ్రాట్ పేర్కొన్నారు. ఆదాయ పన్ను శాఖ తిరుపతి డివిజన్ ఆధ్వర్యంలో ఎస్వీయూనివర్సిటీ శ్రీనివాసా ఆడిటోరియంలో ఆదాయ పన్ను దినోత్సవ సంబరాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. దుర్గేష్ సామ్రాట్ మాట్లాడుతూ.. పన్ను చెల్లింపుదారులు పన్ను స్లాబులపై అవగాహన పెంచుకోవాలని కోరారు. చార్టెడ్ అకౌంటెంట్ విద్యార్థులు ఆదాయ పన్ను నిబంధనలను సమగ్రంగా అవగాహన చేసుకోవడానికి ప్రయత్నం చేయాలని సూచించారు. ఎస్వీయూ ఇన్‌చార్జి వీసీ అప్పారావు, రిజిస్ట్రార్ మాదాల భూపతి నాయుడు మాట్లాడుతూ.. యూనివర్సిటీ స్థాయి ఉద్యోగులు, అధికారులకు ఆదాయ పన్ను చెల్లింపు పట్ల అవగాహన కల్పించే కార్యక్రమాలు చేపట్టాలన్నారు. ఇన్‌కంటాక్స్ జాయింట్ కమిషనర్ వంశీధర్, ఛార్టెడ్ అకౌంటెంట్లు ఫల్గుణకుమార్, రవీంద్ర, ఆదాయ పన్ను శాఖ అధికారులు, సిబ్బంది, ఛార్టెడ్ అకౌంటెంట్ విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సంకట హర చతుర్దశి వేడుకలు

తిరుపతి (జీవకోన), జూలై 24: స్థానిక వినాయకసాగర్ వద్ద గల సంకల్పవరసిద్ధి వినాయక స్వామివారికి సంకట హర చతుర్దశి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం భక్తులకు దర్శన భాగ్యం కల్పించి, తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ కమిటీ సభ్యులు గుండాల గోపీనాథ్‌రెడ్డి, పురోహితులు సురేష్‌స్వామి, ధర్మకర్త చెంగారెడ్డి, తొండమనాటి సుబ్రహ్మణ్యంరెడ్డి, ఆనంద్, వాసు, రాజశేఖర్‌రెడ్డి, విజయలక్ష్మి, శాంతి, వాసుదేవరెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

శ్రీరామ ఇంజనీరింగ్ కాలేజీకి అటానమస్ హోదా

తిరుపతి(విద్య), జూలై 24: కరకంబాడి రోడ్డులోని శ్రీరామ ఇంజనీరింగ్ కళాశాలకు అటానమస్ గుర్తింపు లభించింది. ఈమేరకు న్యూఢిల్లీకి చెందిన యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ), అనంతపురం జేఎన్‌టీయూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారని కళాశాల డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు.ఆయన మాట్లాడుతూ విద్యా ప్రమాణాల్లో మార్పులకు అనుగుణంగా విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులను ఏర్పాటు చేశామని, దీంతో తమ కళాశాలకు అటానమస్ గుర్తింపు వచ్చిందని తెలిపారు. కళాశాల ఇటీవలే న్యాక్ ఏగ్రేడ్ గుర్తింపుని పొందగా.. ఇప్పుడు ప్రతిష్ఠాత్మకమైన అటానమస్ గుర్తింపు రావడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈగుర్తింపునకు కృషి చేసిన ఛైర్మన్ మన్నెం రామిరెడ్డి, సెక్రటరీ మన్నెం రామసుబ్బారెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.జయచంద్ర, అధ్యాపకులకు కృతజ్ఞతలు తెలిపారు.

ఎన్‌ఎంఆర్‌లకు టైం స్కేల్ వర్తింప చేయండి: సీపీఐ



ఇన్‌చార్జి వీసీకి వినతిపత్రం ఇస్తున్న సీపీఐ నేతలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూలై 24: ఎస్వీ యూనివర్సిటీలో పని చేస్తున్న ఎన్‌ఎంఆర్ ఉద్యోగులకు టైం స్కేల్ వర్తింప చేయాలని సీపీఐ కోరింది. సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రామానాయుడు, నగర కార్యదర్శి విశ్వనాథ్ తదితరులు ఇన్‌చార్జి వీసీ అప్పారావును కలిసి బుధవారం వినతి పత్రం అందజేశారు. ఇందుకు స్పందించిన ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ ఎన్‌ఎంఆర్‌ల సమస్యపై ప్రభుత్వంతో చర్చించి న్యాయం చేయడానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. రాజా, చలపతి, సుధాకర్, బాలాజీ, ప్రసాద్, వేలుమలై, నాగమ్మ, శంకర్ పాల్గొన్నారు.

ఎస్వీయూ కో-ఆపరేటివ్ స్టోర్స్ ఇన్‌చార్జిగా అరుణ కుమారి

తిరుపతి, జూలై 24: ఎస్వీయూ కో-ఆపరేటివ్ స్టోర్స్ అధికారిగా అరుణకుమారి నియమితులయ్యారు. చంద్రగిరి సబ్ డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసరుగా ఉన్న అరుణకుమారిని ఎస్వీయూ కో-ఆపరేటివ్ స్టోర్స్ ఇన్‌చార్జిగా ప్రభుత్వం నియమించింది. కోట్లాది రూపాయల వార్షిక లావాదేవీలు కలిగిన ఎస్వీయూ కో-ఆపరేటివ్ స్టోర్స్ కమిటీ పదవులకు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు సిఫారసు లేఖ ద్వారా వైసీపీ విధేయులు ప్రయత్నం చేస్తున్నారంటూ.. వైసీపీ విధేయులకు కో-ఆపరేషన్.. పేరుతో ఆంధ్రజ్యోతి దినపత్రికలో బుధవారం వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అగ్రికల్చర్ అండ్ కార్పొరేషన్ డిపార్ట్‌మెంట్ ఎస్వీయూ కో-ఆపరేటివ్ స్టోర్స్ ఇన్‌చార్జిగా అరుణకుమారిని నియమించింది. ఇందుకు సంబంధించిన సమాచారం ఇటు యూనివర్సిటీ అధికారులకూ అటు జిల్లా కో-ఆపరేటివ్ శాఖ అధికారులకు అందింది. దీంతో, ఇటీవల ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థుల విజయం కోసం కృషి చేసి స్టోర్స్ బాధ్యతలు చేజిక్కించుకోవాలని భావిస్తున్న వారి ఆశలపై నీళ్లు చల్లినట్లు అయ్యింది.

టీడీఆర్ బాండ్ల స్కాంపై విజిలెన్స్ విచారణ

సీఎంను కోరిన ఎమ్మెల్యే ఆరణి

తిరుపతి అర్బన్, జూలై 24: టీడీఆర్ బాండ్ల స్కాంపై విజిలెన్స్ విచారణ చేపట్టాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ముఖ్యమంత్రి చంద్రబాబును కోరారు. బుధవారం ఈ మేరకు అసెంబ్లీలో సీఎంను కలసి తిరుపతి నియోజకవర్గం సమస్యలను వివరించారు. గత ప్రభుత్వం నిలిపివేసిన స్విమ్స్ ఆస్పత్రిలో ప్రాణదాన పథకాన్ని పునఃప్రారంభించేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. స్మార్ట్ సిటీ పనులు త్వరగా పూర్తి చేసేందుకు రాష్ట్ర వాటా రూ.209.98కోట్లు విడుదల చేయాలని, దీనిని కూడా వైసీపీ ప్రభుత్వం స్తంభింపచేసిందన్నారు. స్థానికులకు ఆఫ్‌లైన్ శ్రీవారి దర్శన టోకెన్ల ద్వారా ప్రత్యేక సౌకర్యం కల్పించాలని, గత ఐదేళ్లుగా నమూనాలకే పరిమితమైన ఇంటిగ్రేటెడ్ బస్సు టర్మినల్ నిర్మాణానికి చొరవచూపాలని విజ్ఞప్తి చేశారు. తండ్రీ కొడుకులు భూమన కరుణాకర్‌రెడ్డి, అభినయ్‌రెడ్డి కలసి నాణ్యత లేని మాస్టర్‌ప్లాన్ రోడ్లు నిర్మించారని, తద్వారా భూమి కోల్పోయిన ప్రతి ఒక్కరికీ న్యాయం చేయాలని, దొంగ ఓట్ల కేసు విచారణ వేగవంతం చేసేలా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీచేయాలని కోరారు. ఈ సమస్యలపై ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే పేర్కొన్నారు.

బడ్జెట్‌లో స్వయం ఉపాధి రుణపరిమితి పెంపు

ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్ వి.భాగ్యతేజ



మాట్లాడుతున్న భాగ్యతేజ

తిరుపతి అర్బన్, జూలై 24: బడ్జెట్‌లో స్వయం ఉపాధి రుణపరిమితి పెరిగిందని తిరుపతికి చెందిన ప్రముఖ ఛార్టెడ్ అకౌంటెంట్ వి.భాగ్యతేజ అన్నారు. పబ్లిక్ రిలేషన్స్ సొసైటీ ఆఫ్ ఇండియా తిరుపతి చాప్టర్ ఆధ్వర్యంలో స్థానిక న్యూబాలాజీ కాలనీలోని గ్రీన్‌హోమ్ డెవలపర్స్ కార్యాలయంలో బుధవారం వార్షిక బడ్జెట్-2024పై అవగాహన సదస్సు నిర్వహించారు. భాగ్యతేజ మాట్లాడుతూ కేంద్ర బడ్జెట్‌లో ముద్ర రుణాల పరిమితిని రూ.10లక్షల నుంచి రూ.20లక్షలకు పెంచారని వెల్లడించారు. రాష్ట్రానికి సంబంధించి అమరావతి రాజధాని నిర్మాణానికి రూ.15వేల కోట్లు, పోలవరం ప్రాజెక్టుపూర్తి, విశాఖ-చెన్నై కారిడార్ నిర్మాణం, రాష్ట్ర పునర్వవస్థీకరణ కోసం నిధుల మంజూరు చేస్తామని బడ్జెట్‌లో పేర్కొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో భారతీయ విద్యాభవన్ డైరెక్టర్ సత్యనారాయణరాజు, స్పెషల్ ప్రొటెక్షన్ ఫోర్స్ ఎస్పీ రామచంద్రరాజు, పీఆర్‌ఎస్‌ఐ తిరుపతి చాప్టర్ అధ్యక్షుడు కె.శ్రీనివాసరావు, ఉపాధ్యక్షుడు చంద్రమోహన్, కార్యదర్శి దుద్యాల చంద్రమోహన్, సాయికుమార్‌రెడ్డి, ఆర్.సి.కె. రాజు, మధుసూధన్, రాజేష్, సుధాకర్‌రెడ్డి, స్వరాజ్యలక్ష్మి, త్రిపురసుందరి, పీఆర్‌ఎస్‌ఐ సభ్యులు పాల్గొన్నారు.

ప్రాధాన్యత రంగాలకు లక్ష్యం మేరకు రుణాలు మంజూరు చేయాలి

కలెక్టర్ వెంకటేశ్వర్



బుక్‌లెట్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్

తిరుపతి (కలెక్టరేట్), జూలై 24: వ్యవసాయం, విద్య, ఎంఎస్‌ఎంఈ వంటి ప్రాధాన్యత రంగాలకు లక్ష్యం మేరకు రుణాలు విరివిగా మంజూరు చేయాలని బ్యాంకు అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ కోరారు. జిల్లాస్థాయి బ్యాంకర్స్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి వ్యవసాయం, విద్య, ఎంఎస్‌ఎంఈ, ఫుడ్ ప్రాసెసింగ్ వంటి రంగాలకు ప్రాధాన్యత ఇచ్చి రుణాలను మంజూరు చేయడంతో పాటు లక్ష్యాలను చేరుకోవాలన్నారు. కౌలురైతు కార్డులను రెన్యువల్ చేసుకోవాల్సిన వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని వ్యవసాయాధికారులను ఆదేశించారు. అనంతరం అన్యువల్ క్రెడిట్ ప్లాన్ 2024-25 బుక్‌లెట్‌ను కలెక్టర్ సంబంధిత అధికారులతో కలిసి విడుదల చేశారు. జేసీ శుభం బన్సల్, డీఆర్వో పెంచలకిషోర్, అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.73 కోట్లు

తిరుమల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.73 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం లెక్కించి బుధవారం ఉదయం ప్రకటించింది. మంగళవారం 73,332 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 25,202 మంది తలనీలాలు సమర్పించారు.

30న కపిలతీర్థంలో ఆడికృత్తిక వేడుకలు

తిరుపతి (కల్చరల్), జూలై 24: తిరుపతిలోని కపిలతీర్థం శివాలయంలో ఆగష్టు 30వ తేదీన ఆడికృత్తిక వేడుకలు నిర్వహించనున్నట్లు టీటీడీ బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. ఈ సందర్భంగా ఉదయం 9.30 గంటల నుండి 10.30 వరకు వల్లీ దేవసేనసమేత సుబ్రమణ్యస్వామి ఉత్సవ మూర్తులకు స్నపన తిరుమంజనం జరుగుతుంది. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు సుబ్రమణ్యస్వామి తిరువీధి ఉత్సవం నిర్వహిస్తారు.

28న జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్ల ఎంపిక

తిరుపతి(క్రీడలు), జూలై 24: స్థానిక శ్రీనివాస క్రీడా సముదాయంలో ఈనెల 28న జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ జట్లను ఎంపిక చేయనున్నట్లు అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి డి.సుధీర్ బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఎంపికైన జట్లు వచ్చేనెల 4, 5తేదీల్లో విజయవాడలో జరగనున్న రాష్ట్రస్థాయి జూనియర్ సాఫ్ట్ టెన్నిస్ ఛాంపియన్‌షిప్‌లో ప్రాతినిధ్యం వహిస్తాయని తెలిపారు. ఆసక్తిగల క్రీడాకారులు 28వ తేది ఉదయం 8గంటలకు జనన ధ్రువీకరణపత్రం, ఆధార్, పాస్‌పోర్ట్ సైజ్ నాలుగు ఫొటోలు తీసుకురావాలన్నారు. 2006లో జన్మించిన క్రీడాకారులు అర్హులని, మరిన్ని వివరాల కోసం 90322 70031 నెంబరును సంప్రదించాలని ఆయన కోరారు.

ఉపాధి కూలీలకు అందని బకాయిలు

ఓజిలి, జూలై 24: మండలంలోని ఉపాధి కూలీలకు కోటి 25 లక్షల రూపాయల చెల్లింపులు నిలిచిపోయాయి. మండలంలోని ఉపాధి కూలీలకు 82,500 పని దినాలకు సంబంధించి గత 10 వారాలుగా చెల్లింపులు జరగలేదు. దీంతో ఉపాధి కూలీలు తమ వేతనం కోసం రోజు పోస్టాఫీసు, ఇతర ఏజెన్సీల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. మండలంలో 26 పంచాయతీల పరిధిలో 626 శ్రమ శక్తి సంఘాలు ఉండగా వాటిలో 16,226 మందికి జాబ్ కార్డులు ఉన్నాయి. కాగా గతంలో కూడా ఉపాధి కూలీలకు సక్రమంగా కూలీలు అందకపోవడంతో కొందరు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. గ్రామీణ ప్రాంతాల్లో వలసల నివారణకు స్థానికంగా ఉపాధి కల్పిస్తూ ఈ పథకం ద్వారా కూలీలు అందిస్తున్న నేపథ్యంలో వారాల తరబడి కూలీలకు వేతనాలు చెల్లించక పోవడంపై వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇకనైనా బకాయిలు చెల్లించాలని ఉపాధి కూలీలు కోరుతున్నారు. దీనిపై ఏపీవో ఉషారాణి మాట్లాడుతూ... రూ.1.25 కోట్ల బకాయిలు ఉన్న మాట వాస్తవమన్నారు. కొన్ని పంచాయతీల్లో కొంతమేర చెల్లింపులు జరిగాయన్నారు. తొమ్మిది వారాలుగా చెల్లింపులు జరగలేదన్నారు. ఓజిలితో పాటూ కొన్ని మండలాల్లో చెల్లింపులు జరగలేదన్నారు.

గంజాయి అరికట్టేందుకు చర్యలు తీసుకోండి

హోం మంత్రికి పాశం వినతి


హోం మంత్రి అనితకు వినతిపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు, జూలై 24: గూడూరు నియోజకవర్గంలో గంజాయి, మత్తుపదార్థాల అక్రమ రవాణాన్ని అరికట్టేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ హోంమంత్రి అనితను కోరారు. బుధవారం అమరావతిలోని సచివాయలంలో హోంమంత్రి అనితను కలిసి ఈమేరకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గూడూరు నియోజకవర్గలో గంజాయి అక్రమ రవాణ జరగకుండా, రౌడీయిజాన్ని అరికట్టేలా చర్యలు తీసుకుని శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరామన్నారు. నియోజకవర్గ పరిధిలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంత వాతావరణం నెలకొల్పేలా పోలీసు అధికారులకు సూచనలు జారీ చేయాలని కోరినట్లు ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో కిషోర్‌నాయుడు, మోహన్‌రెడ్డి, శివకుమార్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోండి


మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందిస్తున్న టీడీపీ నాయకులు

గూడూరు, జూలై 24: వర్షాకాలం సమీపిస్తుండడంతో పట్టణంలో పారిశుధ్యం మెరుగుకు చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకులు కోరారు. బుధవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ... ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ బాధ్యతలు చేపట్టగానే పట్టణంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ చేపట్టారన్నారు. పారిశుధ్యాన్ని మెరుగుపరిచి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవడంతోపాటు శివారుప్రాంతాల్లోని వీధిదీపాలు వెలిగేలా చూడాలని కోరారు. మురుగు నీటి కాలువల్లో చెత్తాచెదారాన్ని తొలగించాలన్నారు. బి.చెంచురామయ్య, అబ్దుల్‌రహీం, ఇశ్రాయిల్‌కుమార్, చంద్రమౌళి, రమేష్‌కుమార్, హరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయుడు గుర్రం జాషువా


జాషువాకు నివాళి అర్పిస్తున్న కేవీపీఎస్ నాయకులు

గూడూరు అర్బన్, జూలై 24: గుర్రం జాషువా ఆదర్శ ప్రాయుడని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు బాల సుబ్రమణ్యం అన్నారు. బుధవారం సీపీఎం కార్యాలయంలో కేవీపీఎస్ ఆధ్వర్యంలో గుర్రం జాషువా వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ... సామాజిక రుగ్మతులను, అసమానతలను రూపు మాపేందుకు గుర్రంజాషువా తన రచనలతో కృషి చేశారన్నారు. తన రచనల ద్వారా సమాజంలో చైతన్యాన్ని నింపారన్నారు. ప్రసాద్, శివకుమార్, యాదగిరి, శ్రీనివాసులు, సురేష్, శంకరయ్య, బీవీరమణయ్య, మణి, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాలి

సత్యవేడు, జూలై 24: గ్రామాల్లో పారిశుధ్యానికి పెద్దపీట వేసి స్వచ్ఛ గ్రామాలుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత పంచాయతీ కార్యదర్శులపై ఉందని ఎంపీడీవో చంద్రశేఖర్ పేర్కొన్నారు. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో మండలంలోని కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఓడీఎఫ్ కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛభారత్ మిషన్‌లో భాగంగా మండలంలో గతంలో 8300 మరుగుదొడ్లను నిర్మించినట్లు తెలిపారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు గ్రామాల్లో ఓడీఎఫ్ రీసర్వే చేపట్టి ప్రసుత్తం ఈ మరుగుదొడ్లు వినియోగంలో ఉన్నాయా లేదా? సెప్టిక్ ట్యాంకు ఉందా లేదా? తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని యాప్‌లో నమోదు చేయాలని సూచించారు. అదే విధంగా ఆగస్టు 1వ తేదీకి పింఛన్లను సకాలంలో లబ్ధిదారులకు పంపణీ చేసేందుకు సంబంధిత మ్యాపింగ్‌ను పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సూర్యనారాయణ, ఈవోపీఆర్డీ మునిరవికుమార్, ఇంజనీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

ఓవర్ లోడ్ టిప్పర్ల స్వాధీనం

సత్యవేడు, జూలై 24: ఓవర్ లోడ్‌తో వెళుతున్న తొమ్మిది కంకర టిప్పర్లను తిరుపతి విజిలెన్స్ ఎన్‌ఫోర్స్ మెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్ పట్టణంలో బుధవారం తన సిబ్బందితో కలిసి వాహన తనిఖీలు చేపట్టారు. తమిళనాడుకు వెళుతున్న పలు కంకర టిప్పర్లను ఆపి రికార్డులను పరిశీలించారు. తొమ్మిది టిప్పర్లు ఓవర్‌లోడ్‌తో వెళుతున్న గుర్తించి స్వాధీనం చేసుకుని ఆర్టీసీ డిపో ఆవరణకు తరలించారు.

నిబంధనలు అతిక్రమిస్తే లైసెన్సుల రద్దు

సత్యవేడు, జూలై 24: పురుగు మందులు, ఎరువులు, విత్తనాలను నిబంధనలు అతిక్రమించి అధిక ధరలకు విక్రయిస్తే లైసెన్సులను రద్దు చేస్తామని సత్యవేడు వ్యవసాయ శాఖ డివిజన్ ఏడీఏ సుబ్రహ్మణ్యం హెచ్చరించారు. బుధవారం స్థానిక ఆత్మ కార్యాలయంలో మండలంలోని ఫర్టిలైజర్స్, పెస్టిసైడ్ డీలర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసే మందులు, ఎరువులు, విత్తనాలకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. సమావేశంలో ఏవో మురళి, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రానికి అధిక నిధులు హర్షణీయం

● టీఎన్‌ఎస్‌ఎఫ్

సత్యవేడు, జూలై 24: కేంద్ర బడ్జెట్‌లో రాష్ట్రానికి అత్యధిక నిధులు కేటాయించడం శుభపరిణామమనితెలుగునాడు స్టూడెంట్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి పృథ్వీరాజ్ అన్నారు. అమరావతి నిర్మాణానికి రూ.15వేల కోట్లు కేటాయించడం, పోలవరం పూర్తికి సాయం అందించేందుకు కేంద్రం ముందుకు రావడం, వైజాగ్ - చెన్నై కారిడార్‌కు, రహదారుల నిర్మాణానికి నిధుల మంజూరుకు కేంద్రం మద్దతు ఇవ్వడం హర్షణీయమన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.73 కోట్లు

తిరుమల, జూలై 24 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.73 కోట్లు లభించింది. సోమవారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ మంగళవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈ మేరకు రూ.3.73 కోట్లు ఆదాయం లభించినట్టు బుధవారం ఉదయం ప్రకటించింది.

శిథిలావస్థలో తుఫాన్ షెల్టర్లు


చీమలపాడులో, శ్యామసుందరపురంలో, అద్దేపల్లిలో శిథిలావస్థలో ఉన్న తుఫాన్‌షెల్టర్లు

గూడూరు, జూలై 24: తుఫాన్లు సంభవించిన సమయంలో తీరప్రాంతాల్లోని ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించేందుకు నిర్మించిన షెల్టర్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. తుఫాన్ కారణంగా లోతట్టు ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజల నివాస గృహాల్లోకి నీరు చేరిన సమయంలో వారికి ఆవాసం కల్పించేందుకు షెల్టర్లును నిర్మించారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో షెల్టర్ల అభివృద్ధికి చర్యలు చేపట్ట లేదని తీరప్రాంతవాసులు చెబుతున్నారు. దీంతో తుఫాన్లు సంభవించిన సమయంలో సమీప పాఠశాలల్లోనో, ప్రభుత్వ కార్యాలయాల్లోనో తాత్కాలిక ఏర్పాటు చేస్తున్నట్టు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

గూడూరు నియోజకవర్గ పరిధిలో చిల్లకూరు, కోట, వాకాడు, చిట్టమూరు మండలాల్లో తీరప్రాంత గ్రామాలున్నాయి. ఈ మండలాల్లో తుఫాన్ల సందర్భంగా భారీ వర్షాలు కురిసినప్పుడు లోతట్టు ప్రాంతాలు జలమయమైతే అక్కడి ప్రజలను తుఫాన్ షెల్టర్లకు తరలిస్తుంటారు. గత కొన్నేళ్లుగా వీటి అలనా, పాలనా పట్టించుకోకపోవడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి.

చిల్లకూరు మండలంలో మోమిడి, వరగలి, తమ్మినపట్నం, కోమరావారిపాళెం, పోసివారిపాళెం, రావులవారిపాళెం, మన్నెగుంట, అద్దెపల్లి, తూర్పుకనుపూరు, వేళ్లపాళెం గ్రామాల్లో తుఫాన్‌షెల్టర్లు ఉండగా తూర్పు కనుపూరు, మోమిడి, తమ్మినపట్నం మినహా మిగిలినవి శిథిలావస్థలో ఉన్నాయి. కోట మండలంలోని కొత్తపట్నం, శ్రీనివాసనత్రం, గోవిందుపల్లిపాళెం, సిద్దవరం, దైవాలదిబ్బ, కర్లపూడి, శ్యామసుందరపురంలల్లో తుఫాన్ షెల్టర్లు ఉన్నాయి. వీటిలో కొత్తపట్నం, శ్రీనివాసనత్రం, సిద్దవరంల్లోని షెల్టర్లు నిరుపయోగంగా ఉండగా మిలిగినవి శిథిలావస్థకు చేరుకున్నాయి. వాకాడు మండలం మొనపాళెం, నవాబుపేట, కొండూరుపాళెం, అందలమాల, వాళమేడు, చీమలపాడు, దుగరాజపట్నం గ్రామాల్లో తుఫాన్‌షెల్టర్లు ఉన్నాయి. వీటిలో మొనపాళెం, కొండూరుపాళెం గ్రామాల్లో మినహా మిగిలినవి శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా ఉన్నాయి. చిట్టమూరు మండలంలోని పిట్టివానిపల్లి, బుదరగాలి, పల్లంపర్తి గ్రామాల్లో తుఫాన్‌షెల్టర్లు ఉండగా పిట్టివానిపల్లిలోని షెల్టర్ మినహా మిగిలినవి శిథిలావస్థకు చేరుకున్నాయి. నియోజకవర్గ పరిధిలోని తీరప్రాంత గ్రామాల్లో ప్రజలకు వరదల సమయంలో ఇబ్బందులు కలగకుండా శిథిలావస్థకు చేరిన తుఫాన్‌షెల్టర్లకు సంబంధిత అధికారులు మరమ్మతులు చేపట్టి అందుబాటులోకి తీసుకురావాల్సి ఉంది.

దేశవ్యాప్తంగా నెల రోజుల పాటు నేషనల్ స్పేస్ డే సంబరాలు

షార్ డైరెక్టర్ చేతుల మీదుగా గుంటూరులో ప్రచార పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న షార్ డైరెక్టర్ తదితరులు

సూళ్లూరుపేట, జూలై 24: ఈ ఏడాది ఆగస్టు 23న నిర్వహించే నేషనల్ స్పేస్ డే పురస్కరించుకొని బుధవారం షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ గుంటూరులోని ఆర్‌వీఆర్ జూనియర్ కళాశాలలో ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. చంద్రయాన్-3లో భాగంగా ప్రజ్ఞాన్ రోవర్ గత ఏడాది ఆగస్టు 23న చంద్రుడిపై విజయవంతంగా అడుగు పెట్టింది. దీన్ని పురస్కరించుకొని ప్రధాని నరేంద్రమోదీ ఆ రోజును నేషనల్ స్పేస్ డేగా ప్రకటించారు. ఈక్రమంలో ఈ ఏడాది నేషనల్ స్పేస్ డే సంబరాలను నెల రోజుల పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల్లో నిర్వహించేందుకు ఇస్రో శ్రీకారం చుట్టింది. ఇందులో భాగంగా ఈ నెల 22న భువనేశ్వర్‌లో ఇస్రో చైర్మన్ ఎస్‌సోమనాథ్ ఆధ్వర్యంలో సంబరాలు ప్రారంభమయ్యాయి. బుధవారం రెండో రోజు సంబరాలకు గుంటూరులోని ఆర్‌వీఆర్ జూనియర్ కళాశాల వేదికైంది. షార్ డైరెక్టర్ ఆర్ముగం రాజరాజన్ ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి పోస్టర్లను ఆవిష్కరించారు. నెల రోజుల పాటు దేశంలో వివిధ ప్రాంతాల్లో నిర్వహించే సంబరాల్లో ఇస్రో చేపట్టే రాకెట్ ప్రయోగాలు, ఉపగ్రహాలు, శాస్త్రసాంకేతిక రంగాలపై అవగాహన కల్పిస్తారు. ఈ కార్యక్రమంలో షార్‌లోని సీనియర్ ఉద్యోగులు పాల్గొన్నారు.

దశాబ్ధాలుగా సాగు చేస్తున్నాం... న్యాయం చేయండి

● ఆర్డీవోకు కొత్తపట్నం రైతుల వినతి



గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీవో కిరణ్‌కుమార్

కోట, జూలై 24: కొన్ని దశాబ్ధాలుగా ప్రభుత్వ భూముల్లోనే ఉంటున్నాం... ఆర్థిక స్థోమత లేనికారణంగా ఆ భూములు ఆధీనంలో ఉన్నప్పటికీ సాగు చేయలేదు. తక్షణం స్పందించి భూములను నమ్ముకొని ఉన్న సన్నకారు రైతులైన తమను గుర్తించాలని కొత్తపట్నం రైతులు కోరారు. కోట మండలం కొత్తపట్నంలో బుధవారం చెన్నై, బెంగళూరు కోస్టల్ కారిడార్‌లో భూములు కోల్పోయే రైతులకు పరిహారం పంపిణీ చేసేందుకు గ్రామసభ నిర్వహించారు. గూడూరు ఆర్డీవో ఎం.కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ అధికారులు ఈ గ్రామసభను నిర్వహించారు. చెన్నై - బెంగళూరు కోస్టల్ కారిడార్‌లో కొత్తపట్నం రెవెన్యూలోని 444 ఎకరాలు వెళ్లనున్నాయన్నారు. ఆయా భూములన్నీ దాదాపుగా ప్రభుత్వ భూములే. పంచాయతీ పరిధిలోని పలు మజారా గ్రామానికి చెందిన సన్నకారు రైతులు ఆయా భూముల్లో జీడిమామిడి, వేరుశనగపంటలు పండిస్తున్నామని గ్రామసభలో అధికారుల ముందు రైతులు తెలిపారు. కొన్ని భూముల్లో తాము ఉన్నప్పటికి ఆర్థిక స్థోమతలేని కారణంగా సాగు చేయలేదన్నారు. ఆయా భూములకు సంబంధించిన పరిహారం ఇవ్వాలని రైతులు కోరారు. గురువారం నుంచి కొత్తపట్నం పంచాయతీలో అధికారులతో కూడిన మూడు బృందాలు పర్యటిస్తాయని ఆర్డీవో తెలిపారు. ఆయా బృందాలు కోస్టల్ కారిడార్‌కు వెళ్లే భూముల్లో రైతుల వివరాలు సహా పంటలు సాగు అంశాలపై భూములపై సర్వే చేస్తారన్నారు. అర్హులైన ప్రతి రైతుకు పరిహారం అందేలా చర్యలు తీసుకుంటామని ఆర్డీవో తెలిపారు. రైతుల వినతులు, సమస్యలను గ్రామసభలో చర్చించి నివేదిక తయారుచేశారు. ఈ గ్రామసభలో ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ చంద్రశేఖర్, ఇన్‌చార్జి తహసీల్దారు ఏ.మల్లికార్జున్‌రావు, వీఆర్వో వి.శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ప్రధాన కూడళ్లు

● ఆందోళన చెందుతున్న వాహన చోదకులు


వరగలి క్రాస్ రోడ్డు వద్ద జాతీయ రహదారిపై ప్రమాదకర కూడలి

చిల్లకూరు, జూలై 24: వాహన చోదకులు జాతీయరహదారిపై ఉన్న కూడళ్ల వద్ద వాహనాలను నడపాలంటే భయాందోళన చెందుతున్నారు. మండలంలోని వరగలి క్రాస్ రోడ్డు, కోట క్రాస్ రోడ్డు వద్ద కూడళ్ల ప్రమాదకరంగా ఉన్నాయి. ఈ కూడళ్ల వద్ద ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని వాహన చోదకులు బెంబేలెత్తుతున్నారు. ప్రధానంగా వరగలి క్రాస్ రోడ్డు సమీపంలో తహసీల్దారు కార్యాలయం ఉంది. దీంతో మండల ప్రజలతోపాటు పలు ప్రాంతాలకు చెందిన ప్రజలు సమస్యల పరిష్కారం కోసం వస్తుంటారు. తహసీల్దారు కార్యాలయానికి వెళ్లాలంటే రోడ్డు దాటాల్సి ఉంది. అంతేకాకుండా ప్రస్తుతం కూడళ్ల వద్ద రోడ్డు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వరగలి క్రాస్ రోడ్డు వద్ద పలు ట్రాన్స్‌పోర్టు కార్యాలయాలు, హోటళ్లతోపాటు పలు దుకాణాలు ఉండడంతో లారీలను రోడ్డుపక్కనే నిలుపుతుంటారు. దీంతో కూడలి వద్ద వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటుంది. వాహనదారులు, పాదాచారులు వరగలి క్రాస్ రోడ్డు వద్ద రోడ్డు దాటే సమయంలో ప్రమాదాలకు గురుతామేమోనని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. అదేవిధంగా కోట క్రాస్‌రోడ్డు వద్ద పలు గ్రామాలకు వెళ్లాలన్నా, సమీప ప్రాంతాలలోని పరిశ్రమలకు వెళ్లాన్నా రోడ్డు దాటాల్సి వస్తుంది. దీంతో ఆ సమయంలో కూడా ప్రమాదాలకు గురవుతామేమోనని పలువురు వాహనదారులు అంటున్నారు. గతంలో ఆయా కూడళ్ల వద్ద జాతీయ రహదారిపై రాకపోకలు సాగించే వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు బ్యారికేడ్లను ఏర్పాటు చేశారు. గత వైసీపీ ప్రభుత్వంలో ఆయా కూడళ్ల వద్ద వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో ఆయా కూడళ్ల వద్ద వాహనదారులు చిన్నచిన్న ప్రమాదాలకు గురైన సంఘటనలు కూడా ఉన్నాయి. ఇకనైనా అధికారులు కూడళ్ల వద్ద ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని పలువురు వాహనదారులు, మండల ప్రజలు కోరుతున్నారు.

చిట్టేడులో క్రీడా దినోత్సవం


విజేతలను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

కోట, జూలై 24: మండలంలోని చిట్టేడులో ఉన్న నల్లపరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి ఉన్నత పాఠశాలలో బుధవారం క్రీడా దినోత్సవం సందర్భంగా ఆటలపోటీలు జరిగాయి. ఇన్‌చార్జి హెచ్‌ఎం జయంతి ఆధ్వర్యంలో శిక్షా సప్తాహ్‌లో భాగంగా విద్యార్థిని, విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, చదరంగం, క్యారమ్స్, తొక్కుడుబిళ్ల, దూకుళ్లు, గోలీలాట, బొంగరాల ఆట తదితర పోటీలు నిర్వహించారు. ఆ క్రీడల్లో విజేతలకు షీల్డ్‌లు అందించారు. క్రీడలతో మానసిక ఉల్లాసం పొందవచ్చని ఉపాధ్యాయులు తెలిపారు. పీఈటీ కృష్ణ ఉపాధ్యాయులతో కలసి క్రీడలను పర్యవేక్షించారు.

శ్రీసిటీని సందర్శించిన చిన్మయ మిషన్


చెన్నకేశవ స్వామి ఆలయ సందర్శనలో చిన్మయ మిషన్ ప్రతినిధులు

సత్యవేడు, జూలై 24: చిన్మయ మిషన్ ఆధ్యాత్మిక గురువులు స్వామి మిత్రానంద (చెన్నై), స్వామి రఘువీరానంద(విశాఖపట్నం) తమ సంస్థ ప్రతినిధులతో కలిసి బుధవారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ ఎండీ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి ప్రత్యేకతలు, సామాజిక కార్యక్రమాలు, శ్రీవాణి సాహిత్య సంస్థ ద్వారా చేపడుతున్న ఆధ్యాత్మిక, సాహిత్య సేవల గురించి వివరించారు. శ్రీసిటీలోని చిన్మయ విద్యాలయాన్ని విస్తరించి, ఈ ప్రాంత విద్యాభివృద్ధికి సహకరించాలని చిన్మయ మిషన్ ప్రతినిధులకు రవీంద్ర సన్నారెడ్డి విజ్ఞప్తి చేశారు. శ్రీసిటీ పరిసరాలతో పాటు ఆరూరు సమీపంలోని ప్రసన్న వెంకటేశ్వర స్వామి ఆలయం, చెరివిలోని చెన్నకేశవ స్వామి ఆలయాన్ని చిన్మయ మిషన్ ప్రతినిధులు సందర్శించారు.

ముక్కంటి సేవలో అమెరికన్లు


రాహుకేతు పూజలు చేసుకుంటున్న అమెరికా దేశస్థులు

శ్రీకాళహస్తి, జూలై 24: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వర స్వామిని బుధవారం అమెరికా దేశస్థులు దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికారు. ముందుగా రాహుకేతు పూజలను చేయించుకుని, అనంతరం స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. గురు దక్షిణామూర్తి సన్నిధిలో అమెరికన్లను వేదపండితులు ఆశీర్వదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... శ్రీకాళహస్తీశ్వరాలయంలో శిల్పకళ అద్భుతంగా ఉందని, స్వామిఅమ్మవార్లను దర్శించుకోవడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు.

దాడి కేసులో నిందితుడి అరెస్టు

నాయుడుపేట టౌన్, జూలై 24: మహిళపై కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరచిన కేసులో నిందితుడిని అరెస్టు చేసినట్లు అర్బన్ సీఐ శ్రీనివాసులురెడ్డి తెలిపారు. మంగళవారం తెల్లవారు జామున నాయుడుపేట - మల్లాం జంక్షన్ వద్ద బియ్యం విక్రయించే లక్ష్మి అనే వివాహితపై శ్రీకాళహస్తికి చెందిన నాగార్జున్ అలియాస్ వెంకటరమణ కత్తితో దాడి చేసిన విషయం విదితమే. ఈ కేసులో నాగార్జున్‌ను బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు.

చెంగాళమ్మకు బంగారు కళ్ల వితరణ

సూళ్లూరుపేట, జూలై 24: తెలుగు, తమిళ భక్తుల ఆరాధ్య దేవత చెంగాళమ్మ పరమేశ్వరి అమ్మవారికి బుధవారం సూళ్లూరుపేట పట్టణానికి చెందిన ఏ.రాము, సుజాత దంపతులు 8 గ్రాముల బంగారు కళ్లు, అదే విధంగా 9 గ్రాముల వెండి కళ్లను వితరణ చేశారు. వారికి ఆలయ సిబ్బంది కామేశ్వరరావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి దర్శనం కల్పించారు. అనంతరం అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ సిబ్బంది వంశీ, శేఖర్, మూర్తి తదితరులు ఉన్నారు.

ఆరు కిలోల గంజాయి పట్టివేత


పట్టుబడిన గంజాయి, నిందితుడితో సెబ్ అధికారులు

గూడూరు, జూలై 24: అనుమానాస్పదంగా తిరుగుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకుని అతని నుంచి 6 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నట్లు సెబ్ ఏఈఎస్ జె.రమేష్ తెలిపారు. బుధవారం స్థానిక సెబ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ... చిల్లకూరు మండలం బూదనం టోల్‌ప్లాజా వద్ద బుధవారం వాహన తనిఖీలు చేపట్టామన్నారు. ఈ సమయంలో ఒడిశా రాష్ట్రం కోరపల్లి కి చెందిన నందసాహు అనే వ్యక్తి ఓ బ్యాగ్‌పట్టుకుని అనుమానస్పదంగా తిరుగుతున్నాడన్నారు. దీంతో అతన్ని ఆపి బ్యాగ్‌ను సోదా చేయగా రూ.30వేల విలువైన ఆరు కిలోల గంజాయి ఉండడంతో స్వాధీనం చేసుకుని నందసాహును అరెస్ట్ చేశామన్నారు. ఇతను చెన్నైలోని రెడ్‌హిల్స్‌లో ఓ హోటల్‌లో పనిచేస్తూ ఒడిశా గంజాయిని చెన్నైకు తరలించి విక్రయిస్తాడని విచారణలో తేలిందన్నారు. ఈ దాడుల్లో ఎస్‌ఈబీ సీఐ ఎం.రమేష్, ఎస్‌ఐలు మోసెస్, విజయ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఉపాధి హామీ పనులు


ఫీల్డ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న ఈసీ

డక్కిలి, జూలై 24 : ఉపాధి హామీ పథకం కింద చేపట్టే పనుల్లో ఫీల్డ్ అసిసెంట్లు పారదర్శకత పాటించాలని ఉపాధిహామీ పథకం ఈసీ దామోదర్ పేర్కొన్నారు. స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో బుధవారం ఉపాధి హామీ పనులపై ఫీల్డ్ అసిసెంట్లతో సమావేశం నిర్వహించారు. ప్రతి ఒకరికీ పనులు కల్పించాలన్నారు. మస్టర్లు నమోదులో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. పనికి హాజరుకాని వారికి మస్టర్లు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రస్తుతం జరుగుతున్న పనుల వివరాలను తెలుసుకున్న ఆయన పనుల నిర్వహణపై పలు సూచనలు ఇచ్చారు.

ప్రమాదాల నివారణకు బారికేడ్ల ఏర్పాటు


హోలి క్రాస్ కూడలి వద్ద ఏర్పాటు చేసిన బ్యారికేడ్

సూళ్లూరుపేట, జూలై 24: పట్టణం మీదుగా వెళ్లే జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు సూళ్లూరుపేట పోలీసులు ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశాల మేరకు నాయుడుపేట డీఎస్పీ శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో సీఐ మధుబాబు, ఎస్ఐ రహీం రెడ్డి స్థానిక హోలిక్రాస్ కూడలి వద్ద జాతీయ రహదారిపై బారికేడ్లు ఏర్పాటు చేశారు. జాతీయ రహదారికి ఇరువైపులా ఏర్పాటు చేసి సర్కిల్ వద్ద కానిస్టేబుళ్లను నియమించారు. దీంతో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ స్తంభం మార్పిడితో తాగునీటి సరఫరాకు అంతరాయం



నాయుడుపేట టౌన్, జూలై 24: పట్టణంలోని గాంధీమందిరం పార్కు వద్ద విద్యుత్ స్తంభం మార్పిడికి తీసిన గుంతలో దిగువన వాటర్ పైపులైన్ ధ్వంసమైనట్లు మున్సిపల్ కమిషనర్ ఎం. జనార్ధన రెడ్డి బుధవారం తెలి పారు. పైపులైన్లు ధ్వంసం కావడంతో పట్టణంలోని బాలాజీ గార్డెన్స్, పొగ గొట్టం కాలనీ, పడమటి వీధి, శంకరా పురం, గెరిడీ వీధి, బ్రాహ్మణ వీధి, జైహింద్ కాలనీలకు గురువారం సాయంత్రం వరకు తాగునీటి సరఫరా ఉండదని మున్సిపల్ ఏఈ చంద్రమోహన్ తెలిపారు.

అక్రమ కట్టడాన్ని అడ్డుకున్న ఆర్‌అండ్‌బీ అధికారులు



నాయుడుపేట, జూలై 24: పట్టణంలోని ఆర్‌అండ్‌బీ రోడ్డులో అక్రమ కట్టడాన్ని సంబంధిత అధికారులు బుధవారం అడ్డుకున్నారు. స్థానిక సెంట్రల్ బ్యాంక్ నుంచి గాంధీ మందిరం పార్కు వరకు 14 మీటర్ల డబుల్ లైన్ సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు జరగనున్నాయి. వీటి నడుమ విజయ గణపతి ఆలయ ప్రాంతంలో ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ప్రైవేటు వ్యక్తి ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుకు నిర్మాణం చేపడుతుండగా ఆర్‌అండ్‌బీ ఏఈ చంద్రానాయుడు, వర్క్‌ఇన్‌స్పెక్టర్ రమణ సిబ్బందితో అడ్డుకున్నారు. సొంత స్థలంలో ఏర్పాటు చేసుకోవాల్సిందిగా సూచించారు.

మహిళ మెడ నుంచి సరుడు దోపిడీ

నాయుడుపేట టౌన్, జూలై 24: పట్టణంలోని కావమ్మ గుడి వీధిలో మహిళ మెడ నుంచి 3 సవర్ల సరుడు దోపిడీ జరిగింది. కాలనీలో నివాసం ఉంటున్న వెంకమ్మ బుధవారం మధ్యాహ్నం 2 గంటల సమయంలో తన మనవడిని ఆటో ఎక్కించి తిరిగి వస్తుండగా అకస్మాత్తుగా ఓ గుర్తుతెలియని యువకుడు వెనుకనుంచి వెంకమ్మ మెడలో ఉన్న 3 సవర్ల సరుడును లాక్కొని పరారయ్యాడు. వెంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు పోలీసులు తెలిపారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

ఆడికృత్తిక ఉత్సవాలకు అంకురార్పణ



పూజాద్రవ్యాలను తీసుకువస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, జూలై 24: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా విజ్ఞానగిరిపై వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత కుమారస్వామి ఆలయంలో ఆడికృత్తిక ఉత్సవాలకు బుధవారం ఆగమోక్తంగా అంకురార్పణ పూజలు నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలోని చెంగల్వరాయస్వామి సన్నిధి వద్ద వేదమంత్రోచ్చారణ నడుమ పూజలు నిర్వహించారు. గురువారం ధ్వజారోహణం జరగనుంది. కార్యక్రమంలో ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి, వేదపండితులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ.2,23 కోట్లు



హుండీ ఆదాయాన్ని లెక్కిస్తున్న సిబ్బంది

శ్రీకాళహస్తి, జూలై 24: శ్రీకాళహస్తీశ్వ రాలయం హుండీ ఆదాయం రూ.2,23,73,531 వచ్చినట్లు ఈవో ఎన్‌వీఎస్ఎన్ మూర్తి తెలిపారు. బుధవారం ఆలయంలోని గురుదక్షిణా మూర్తి సన్నిధి వద్ద హుండీ ఆదాయాన్ని లెక్కించారు. ప్రధాన హుండీలతో పాటు పరివార దేవతల వద్ద ఉన్న హుండీల ద్వారా రూ.2,23,73,531 నగదు, బంగారం 124.400 గ్రాములు, వెండి 677.400 కిలోలు, విదేశీ కరెన్సీ 183 వచ్చింది. గత నెల 19 నుంచి ఈ ఆదాయం వచ్చినట్లు ఈవో తెలిపారు.

సంప్రదాయ క్రీడలను ప్రోత్సహించాలి

నారాయణవనం, జూలై 24: సంప్రదాయ క్రీడలను యోగాతో అనుసంధానం చేసి విద్యార్థుల్లో ఆసక్తి కలిగేలా ప్రోత్సహించాలని విశ్రాంత వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ రమేష్‌బాబు అన్నారు. బుధవారం మండల పరిధిలోని పాలమంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శిక్షా సప్తాహ్ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు సంప్రదాయ క్రీడలను గురించి అవగాహన కల్పించారు. క్రీడల ద్వారా శారీరక దృఢత్వంతో పాటు ఏకాగ్రత పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా పార్వేట ఉత్సవం



శ్రీకాళహస్తి, జూలై 24: పట్టణంలోని చెన్నైరోడ్డులో వెలసిన ద్రౌపదీ సమేత ధర్మారాజస్వామి ఆలయంలో బుధవారం పార్వేట ఉత్సవం వైభవంగా నిర్వహించారు. ఆలయ అలంకార మండపంలో స్వామి అమ్మవార్లకు పలు రకాల అభిషేకాలు చేశారు. అనంతరం విశేషంగా అలంకరించి ధూప దీప నైవేద్యాలు సమర్పించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల నడుమ స్వామి అమ్మవార్లను చప్పరంపై అధిష్ఠింపజేసి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు కర్పూర హారతులు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

ఆధార్ సేవలను సద్వినియోగం చేసుకోండి

వరదయ్యపాళెం, జూలై 24: మండలంలోని చిన్నపాండూరు సచివాలయంలో గురువారం ఆధార్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో ప్రసాద్ తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

వసతిగృహంలో ఆర్డీవో తనిఖీలు



విద్యార్థులతో మాట్లాడుతున్న ఆర్డీవో చంద్రముని

వరదయ్యపాళెం, జూలై 24: మండలంలోని సాంఘిక సంక్షేమ ప్రభుత్వ బాలుర వసతిగృహాన్ని సూళ్లూరుపేట ఆర్డీవో చంద్రముని బుధవారం తనిఖీ చేశారు. గదుల శుభ్రత, మౌలిక సదుపాయాలు, భోజన సౌకర్యం తదితర విషయాలను వార్డెన్ జయరామ్‌ను విద్యార్థుల సమక్షంలో అడిగి తెలుసుకున్నారు. గదులకు తలుపులు, కిటికీలు దెబ్బతిన్నాయని విద్యార్థులు చెప్పగా, వసతి గృహానికి ప్రహరీ నిర్మించాలని వార్డెన్ ఆర్డీవోను కోరారు. ఆర్డీవో వెంట ఆర్ఐ వేణుగోపాల్, వీఆర్వోలు నాగేంద్ర, చలపతి తదితరులు ఉన్నారు.

లారీ ఢీకొని మహిళ మృతి

నారాయణవనం, జూలై 24: మండల పరిధిలోని నైనారుకండ్రిగ ఎస్టీ కాలనీ వద్ద లారీ ఢీకొనడంతో మహిళ మృతి చెందిన సంఘటన బుధవారం ఉదయం జరిగింది. పోలీసుల కథనం మేరకు... నైనారుకండ్రిగ, పుత్తూరు - చెన్నై జాతీయ రహదారిపై బుధవారం ఉదయం కాలినడకన వెళ్తున్న ఐఆర్ కండ్రిగ గ్రామానికి చెందిన మల్లీశ్వరి (51)ని వెనుకవైపు నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో మల్లీశ్వరి అక్కడికక్కడే మృతి చెందారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

యువకుడి అదృశ్యం



తిరుమల

ఏర్పేడు, జూలై 24: ఏర్పేడు మండలం చింతలపాళెం గ్రామానికి చెందిన తిరుమల(35) నాలుగు రోజుల నుంచి కనిపించడంలేదని అతని భార్య సుజాత బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ శ్రీరామ శ్రీనివాసుల కథనం మేరకు... తిరుమల ఈనెల 21వ తేదీ ఉదయం ఏర్పేడుకు వచ్చి చేపలు కొనుగోలు చేసి తీసుకెళ్లి భార్యకు ఇచ్చాడు. ఇంటి నుంచి బయటకు వెళ్లి మధ్యాహ్నం భోజనానికి కూడా రాలేదు. ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వస్తుండడంతో బంధువులు, పరిచయస్తులను సుజాత వాకబు చేసింది. ఎక్కడా ఆచూకీ లేకపోవడంతో బుధవారం పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఈవీఎం గోదాము తనిఖీ

రేణిగుంట, జూలై 24: సార్వత్రిక ఎన్నికల పోలింగ్ ఫలితాల అనంతరం ఈవీఎంలను రేణిగుంటలోని ఓ గోదాములో పటిష్ఠమైన బందోబస్తు నడుమ భద్రపరిచారు. ఈ నేపథ్యంలో బుధవారం మధ్యాహ్నం కలెక్టర్ వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజకీయ పార్టీల సమక్షంలో గోదాములో భద్రపరచిన ఈవీఎం యంత్రాలు, వీవీ ప్యాట్‌లను కట్టుదిట్టమైన ఎస్కార్ట్ నడుమ బెంగళూరులోని బెల్ కంపెనీకి పంపుతున్నామని తెలిపారు. కార్యక్రమంలో ఈవీఎం గోదాము ఇన్‌చార్జి కోదండ రామిరెడ్డి, ఎన్నికల సూపరింటెండెంట్ చంద్రశేఖర్, డీటీ పవన్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ రోడ్లకు మరమ్మతులు



రేణిగుంట - పాపానాయుడుపేట రోడ్డు మరమ్మతు పనులను పర్యవేక్షిస్తున్న జేఈ ప్రమీల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఏర్పేడు, జూలై 24: ఏర్పేడు మండలంలో అధ్వానంగా ఉన్న గ్రామీణ రోడ్లకు ఆర్‌అండ్‌బీ అధికారులు బుధవారం మరమ్మతులు చేపట్టారు. గుంతలమయంగా గ్రామీణ రోడ్లు శీర్షికన బుధవారం ఆంధ్రజ్యోతిలో వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన ఆర్‌అండ్‌బీ ఈఈ మధుసూదనరావు రేణిగుంట నుంచి పాపానాయుడుపేట, పాపానాయుడుపేట నుంచి ముసలిపేడు, వికృతమాలకు వెళ్లే రోడ్లకు వెంటనే మరమ్మతులు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. జేఈ ప్రమీల, వర్క్ ఇన్‌స్పెక్టర్ మురగయ్య నాయుడు పనులను పర్యవేక్షించారు. మండలంలో దెబ్బతిన్న అర్‌అండ్‌బీ రోడ్లకు రూ.10కోట్ల నిధులు మంజూరు చేయాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని జేఈ ప్రమీల తెలిపారు.

గుర్రం జాషువాకు నివాళి

బుచ్చినాయుడుకండ్రిగ, జూలై 24: మండలంలోని కల్లివెట్టు ఉన్నత పాఠశాలలో గుర్రం జాషువా వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ఉపాధ్యాయులు, విద్యార్థులు పుష్పాంజలి ఘటించారు. అభ్యుదయ రచయితల సంఘం జిల్లా అధ్యక్షుడు యువశ్రీ మురళి, ఉపాధ్యాయులు సురేష్‌బాబు, ప్రసాద్, నాదెండ్ల మురళి, వేణుగోపాల్, దాసు, లక్ష్మయ్య, జగన్నాథం తదితరులు పాల్గొన్నారు.

అందరి కళ్లూ నచ్చనేరి భూములపైనే..

- 20 ఎకరాల ప్రభుత్వ భూమి చదును
- ఆక్రమిత స్థలం విలువ రూ.30 కోట్లు
- పట్టించుకోని రెవెన్యూ అధికారులు



నచ్చనేరి రెవెన్యూలో రెండు రోజులుగా చదును చేస్తున్న ప్రభుత్వ భూమి

ఏర్పేడు, జూలై 24: ఏర్పేడు నుంచి పల్లంపేట వరకు ఎక్కడ భూమి కనిపిస్తే అక్కడ అక్రమార్కులు డేగల్లా వాలిపోతున్నారు. కబ్జా చేసి చదును చేస్తున్నారు. ఏర్పేడు మండలంలో కేంద్రీయ విద్యాసంస్థలైన ఐసర్, ఐఐటీలు ఏర్పాటు కావడంతో ఆ ప్రాంతంలో భూముల ధరలు అమాంతం పెరిగాయి. దీంతో అక్రమార్కులు కన్ను ఐఐటీ చుట్టూ ఉన్న ప్రభుత్వ భూములపై పడింది. ఐఐటీ ప్రహరీకి ఆనుకుని ఉన్న నచ్చనేరి రెవెన్యూ పరిధిలో సర్వే నెంబరు 23లో ఉన్న ప్రభుత్వ భూమిని గత రెండు రోజులుగా ఎక్స్‌కవేటర్ల సాయంతో చదును చేస్తున్నారు. గ్రామస్తులు ప్రశ్నించగా తమకు మాజీ సైనికుల పట్టా ఉందని కొందరు, హైకోర్టు ఆర్డర్ ఉందని మరికొందరు రాత్రిపగలూ ఎక్స్‌కవేటర్లతో చదును చేస్తున్నారు. నచ్చనేరి రెవెన్యూ సర్వే నెంబరు 23లో 218 ఎకరాల విస్తీర్ణం ఉంది. ఇందులో నచ్చనేరి పంచాయతీకి సంబంధించిన 70మంది రైతులకు వంద ఎకరాలను 20 ఏళ్ల కిందట ప్రభుత్వం పంపిణీ చేసింది. మిగిలిన 118 ఎకరాల భూమికి కొందరు తప్పుడు రికార్డులు సృష్టించుకుని ఆక్రమించుకోవడానికి ప్రయత్నం చేశారు. నచ్చనేరి గ్రామస్తులు తిరుగుబాటు చేయంతో వెనుదిగి వెళ్లిపోయారు. హైకోర్టు ఆర్డర్ ఉందని తిరుపతి చెందిన ఓ మహిళ పేరిట అక్రమ పట్టాలు చూపించి మళ్లీ రెండురోజుల నుంచి ఎక్సకవేటర్ల సాయంతో చదును చేస్తున్నారు. తహసీల్దారు కార్యాలయానికి కూతవేటు దూరంలో రూ.30కోట్లు విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురవుతున్నా రెవెన్యూ యంత్రాంగం పట్టించుకోకపోవడంపై గ్రామస్తులు నిరసన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఈనెల 22వ తేదీన తహసీల్దారు ఉదయ్‌భాస్కర్‌రాజుకు ఫిర్యాదు చేశామని, అధికారులు స్పందించకపోతే తహసీల్దారు కార్యాలయాన్ని ముట్టడించి ఆందోళన చేపడతామని గ్రామస్తులు తెలిపారు.

టీచ్ టూల్‌తో అత్యుత్తమ బోధన



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీవైఈవో ప్రభాకర్‌రాజు

శ్రీకాళహస్తి, జూలై 24: టీచ్ టూల్‌లో ఉపాధ్యాయులు అత్యుత్తమ బోధన అందించేందుకు సాధ్యమవుతుందని పుత్తూరు డీవైఈవో ప్రభాకర్‌రాజు అన్నారు. శ్రీకాళహస్తి పట్టణం జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న టీచ్ టూల్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు పాఠ్యాంశంలోని అన్ని విభాగాల ద్వారా నాణ్యమైన బోధన కొనసాగించేందుకు టీచ్ టూల్ పరిశీలన ఎంతగానో సహకరిస్తుందని తెలిపారు. శిక్షణ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు తరగతి గదిలో ఉపాధ్యాయుల బోధనను సంబంధిత యాప్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో శివశంకరయ్య, డైట్ అధ్యాపకులు చెంగల్‌రాజు, రాష్ట్ర పరిశీలకురాలు విజయ, ఎంఈవో భువనేశ్వరి, ప్రధానోపాధ్యాయురాలు రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

మంచి ఆహారంతో మెరుగైన ఆరోగ్యం

శ్రీకాళహస్తి, జూలై 24: మంచి ఆహారంతో మెరుగైన ఆరోగ్యం లభిస్తుందని ది స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు విశాల అన్నారు. పట్టణంలోని స్కూల్‌లో బుధవారం ఫుడ్ ఫెస్టివ్ నిర్వహించారు. కిండర్‌గార్డెన్ విద్యార్థులచే తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థి దశలోనే ఆహారపు అలవాట్లను గురించి తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. బయట చేసే ఆహార పదార్థాలు, జంక్‌ఫుడ్స్‌కు దూరంగా ఉండాలని, ఇంట్లో తయారు చేసిన పదార్థాలను తినాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

జగన్ అసత్య ప్రచారాలు మానుకోవాలి: టీడీపీ

శ్రీకాళహస్తి, జూలై 24: మాజీ సీఎం జగన్ అసత్య ప్రచారాలు మానుకోవాలని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి రెడ్డివారి గురవారెడ్డి హితవు పలికారు. బుధవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన చంద్రబాబు నాయుడు రాష్ట్రంలో ప్రశాంత పాలన సాగిస్తుంటే 36హత్యలకు జరిగాయని అబద్ధపు ప్రచారాలు చేస్తూ దేశరాజధాని ఢిల్లీలో నిరసన తెలపడం సరికాదన్నారు. గత ఐదేళ్లగా రాష్ట్రంలో ఆటవిక పాలన సాగించి ప్రజలను ఇబ్బందులు పెట్టిన జగన్‌కు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాగేశ్వరరావు, రాఘవులు యాదవ్, కేకే రమణ, రమణయ్య, మురళి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధికి బడ్జెట్ కేటాయింపులు సంతోషకరం

శ్రీకాళహస్తి, జూలై 24: రాష్ట్రాభివృద్ధికి కేంద్రం బడ్జెట్ నిధుల కేటాయింపు సంతోషకరమని తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు అధ్యక్షుడు గోపీనాథ్‌రెడ్డి అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధానికి బడ్జెట్‌లో కేంద్రం రూ.15వేల కోట్లు విడుదల చేయడం, పోలవరం ప్రాజెక్టు పూర్తికి సహాయ సహకారాలు అందిస్తామని చెప్పడం శుభపరిణామమన్నారు. అలాగే వైజాగ్ - చెన్నై ప్రత్యేక కారిడార్‌కు నిధులు మంజూరు, రహదారుల అభివృద్ధికి నిధులు కేటాయించడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో తిరుపతి పార్లమెంటు తెలుగు రైతు ఉపాధ్యక్షులు ప్రకాష్ నాయుడు, చిన్నారెడ్డి, ప్రసాద్‌రాజు, కేఎస్ రవి తదితరులున్నారు.

కట్నం కోసం వేధిస్తున్నారని ఫిర్యాదు

ఏర్పేడు, జూలై 24: అదనపు కట్నం తీసుకురావాలని తన భర్తతో పాటు కుటుంబ సభ్యులు శారీరకంగా, మానసికంగా వేధిస్తున్నారని ఏర్పేడు మండలం పాపానాయుడుపేటకు చెందిన సునీత బుధవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసింది. సీఐ శ్రీరామ శ్రీనివాసులు కథనం మేరకు.... పాపానాయుడుపేటకు చెందిన సునీత(29)కు చెన్నైలోని పెరంబదూరుకు చెందిన మురళీకృష్ణతో నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. వివాహ సమయంలో సునీత పుట్టింటి వారు 25 సవర్ల బంగారు ఆభరణాలు, రూ.30లక్షలు నగదు కట్నంగా ఇచ్చారు. అది చాలదని, అదనపు కట్నం తేవాలని మురళీకృష్ణ కొంతకాలంగా సునీతను వేధించేవాడు. దీంతో ఆమె కొంతకాలంగా తన పుట్టిల్లు అయిన పాపానాయుడుపేటలో నివాసం ఉంటోంది. ఈ క్రమంలో భర్త కుటుంబ సభ్యులు అదనపు కట్నం తేవాలని వేధిస్తున్నారని బుధవారం సాయత్రం ఏర్పేడు పోలీసులకు ఫిర్యాదు చేసింది. సునీత భర్త మురళీకృష్ణతో పాటు నలుగురు కుటుంబసభ్యులపై కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీరామ శ్రీనివాసులు తెలిపారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన



విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతున్న సీడీపీవో

కేవీబీపురం, జూలై 24: మండలంలో ఆదరం, గుంటిపేడు గ్రామాల్లో చిన్నారుల తల్లిదండ్రులకు పిచ్చాటూరు ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శోభారాణి బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కల్పించారు. బుధవారం ఆమె అంగన్వాడీలను తనిఖీ చేశారు. సక్రమంగా విధులు నిర్వహించని వారికి హెచ్చరికలు జారీ చేశారు. ఆదవరం అంగన్‌వాడీ కార్యకర్తలకు మెమో జారీ చేసినట్లు సీడీపీవో తెలిపారు. తల్లిదండ్రులతో మాట్లడుతూ బిడ్డలకు చిన్న వయసులో వివాహాలు చేయడం వల్ల ఎన్నో అనర్థాలు చోటు చేసుకుంటాయన్నారు. బాల్యవివాహాలను ప్రోత్సహించినా, చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. బడిమానేసిన పిల్లలను కూడా బడుల్లో చేర్పాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ కల్పలత, అంగన్వాడీలు పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

శ్రీకాళహస్తి, జూలై 24: శ్రీకాళహస్తి పట్టణానికి చెందిన ఆక్స్‌ఫర్డ్ విద్యార్థులు ఆదివారం హైదరాబాద్‌లో జరిగిన ఫస్ట్ ఇంటర్నేషనల్ షోబెలెడ్ షిదోకన్ కరాటే పోటీల్లో సత్తా చాటారు. కరాటే మాస్టర్ సంపత్‌కుమార్ నేతృత్వంలో విద్యార్థులు జ్యోతీశ్వర్, క్రాంతికుమార్, కిరణ్‌కుమార్ మొదటి, ద్వితీయ స్థానాల్లో నిలిచి బహుమతులు సాధించారు.

పుత్తూరు వార్తలు

సెప్టెంబరు 4న పిడికిలి గంగమ్మ జాతర

పుత్తూరు, జూలై 24: పుత్తూరు పట్టణంలోని పిడికిలి గంగమ్మ జాతరను సెప్టెంబరు 4వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు జాతర కమిటీ ఛైర్మన్ నైనేరి విక్కీ రాయల్ తెలిపారు. ఏటా తిరునాళ్ల తర్వాత నిర్వహించే జాతరకు ఆగస్టు 27న మంగళవారం రాత్రి చాటింపు వేస్తామన్నారు. అలాగే సెప్టెంబరు 1నుంచి 3వ తేదీ వరకు గెరిగెను పట్టణ వీధుల్లో ఊరేగించి 4న జాతరను నిర్వహిస్తామని పేర్కొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



పుత్తూరు అర్బన్, జూలై 24: పుత్తూరు పట్టణానికి చెందిన పి.చరణ్ తేజకు ఎస్వీ యూనివర్సిటీ మైక్రోబయాలజీ విభాగం డాక్టరేట్ ప్రదానం చేసింది. మాలిక్యులర్ అనలైసిస్ ఆఫ్ బ్యాక్టీరియల్ డైవర్సిటీ అసోసియేటెడ్ విత్ ముస్కోవైట్ - ఏ కామన్ రాక్ ఫార్మింగ్ ఫిల్లోసిలికేట్ అనే అంశంపై ప్రొఫెసర్ చింతల పరమగీతం పర్యవేక్షణలో సమర్పించిన పరిశోధనకు డాక్టరేట్ ఇచ్చినట్లు చరణ్‌తేజ్ తెలిపారు.

రాస్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం



పరీక్షలు చేస్తున్న వైద్యులు

పుత్తూరు టౌన్, జూలై 24: పుత్తూరు మండల పరిధిలోని రామసముద్రం పంచాయతీలో బుధవారం రాష్ట్రీయ సేవా సమితి ఆధ్వర్యంలో టాటా ట్రస్ట్ సహకారంతో ఉచిత వైద్య శిబిరం గ్రామస్తులకు బీపీ, షుగర్, హైపటైటిస్, నోరు, రొమ్ము, గర్భసంచి, గర్భాలయ క్యాన్సర్ పరీక్షలు నిర్వహించారు. క్యాన్సర్ పట్ల మహిళలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టాటా ట్రస్ట్ వైద్యులు వెంకయ్యబాబు, రాస్ అధికారులు రవి, ప్రకాష్, జయలక్ష్మి, బాలమ్మ, టాటా వైద్యశాల మేనేజర్ హేమంత్, మోహతాజ్, రెడ్డికుమారి, మహేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుదారులతో మర్యాదగా మెలగండి: ఎస్పీ



నారాయణవనం పోలీస్‌స్టేషన్‌లో రికార్డులను పరిశీలిస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

పుత్తూరు అర్బన్, జూలై 24: స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల పట్ల మర్యాదపూర్వకంగా మెలగాలని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు సూచించారు. బుధవారం పుత్తూరు సబ్ డివిజన్ పరిధిలోని వడమాలపేట, పుత్తూరు అర్బన్, నారాయణవనం, వరదయ్యపాళెం పోలీస్‌స్టేషన్లను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది క్రమశిక్షణతో వ్యవహరించడమే కాకుండా విధి నిర్వహణలో హుందాగా వ్యవహరించాలని స్పష్టం చేశారు. ఆయా స్టేషన్ల పరిధిలో గాంబ్లింగ్, సారా, గంజాయిపై ఉక్కుపాదం మోపాలన్నారు. హైవేలపై ఎలాంటి అక్రమ రవాణా జరగకుండా నిరంతరం తనిఖీలు నిర్వహిస్తూ అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎస్‌హెచ్‌వోలు తరచూ గ్రామాల్లో పర్యటిస్తూ గ్రూప్ తగాదాలు లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. సైబర్ నేరాలు, ఫేక్‌లోన్ యాప్‌ల పట్ల అవగాహన కలిగించి నేరాలకు అడ్డుకట్టవేయాలన్నారు. సదాశివకోన, కైలాసనాధకోన, సద్దికూడుమగుడు తదితర పర్యాటక ప్రాంతాల్లో విజిబుల్ పోలీసింగ్ ఏర్పాటు చేసి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. మహిళా పోలీసు సిబ్బంది తరచూ పాఠశాలలు, కళాశాల వద్ద నిఘా ఉంచి ఈవ్ టీజింగ్ పట్ల కఠినంగా వ్యవహించాలన్నారు. అనంతరం స్టేషన్లలో పెండింగ్ ఉన్న కేసు రికార్డులను పరిశీలించి సూచనలిచ్చారు. ఆయన వెంట డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐలు, ఎస్ఐలు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డు పరిశీలన

పుత్తూరు అర్బన్, జూలై 24: పట్టణ పరిధిలోని బైపాస్ వద్ద ఉన్న డంపింగ్ యార్డును బుధవారం మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి పరిశీలించారు. ప్రతిరోజు పట్టణంలో పోగయ్యే వ్యర్థాలతో డంపింగ్ యార్డు పూర్తిగా నిండిపోయింది. దీంతో వ్యర్థాలను తొలగించేందుకు కాంపాక్టర్లు, ఎక్స్‌కవేటర్లతో చదును చేయించారు. ఆయన వెంట ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఇంద్రసేన నాయుడు ఉన్నారు.

కృత్రిమ కాలు ఆశావహులకు అవకాశం

పుత్తూరు అర్బన్, జూలై 24: మున్సిపల్ పరిధిలో వెయిట్‌లెస్ కృత్రిమ కాలును అమర్చుకునేందుకు అవసరమున్న విభిన్న ప్రతిభావంతులు శనివారం తిరుపతిలో నిర్వహించే ప్రత్యేక శిబిరానికి హాజరుకావాలని మున్సిపల్ కమిషనర్ కేఎల్ఎన్ రెడ్డి ఒక ప్రకటనలో కోరారు. జిల్లా విభిన్న ప్రతిభావంతులు, హిజ్రాలు, వృద్ధుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో తిరుపతిలోని రాస్ భవనంలో శనివారం ఉదయం క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెన్నైకు చెందిన ఫ్రీడం ట్రస్ట్ నిర్వాహకులు కృత్రిమ కాలు అవసరమైన వారి కొలతలు తీసుకుని 21రోజుల తరువాత ఉచితంగా అమరుస్తారని ఆయన పేర్కొన్నారు. అవసరమైన వారు ఆధార్, రేషన్‌కార్డు, సదరం సర్టిఫికెట్, వికలత్వం కనిపించే విధంగా రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలు, ఫోన్ నెంబర్ తదితర వివరాలతో క్యాంపునకు హాజరుకావాలని ఆయన సూచించారు.

వైభవంగా గంగ జాతర



వడమాలపేట, జూలై 24: అప్పలాయగుంటలో బుధవారం గంగజాతర వైభవంగా జరిగింది. వేకువ జామున అమ్మ వారు గ్రామోత్సవంలో భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అమ్మవారిని మాడవీధిలో నెలకొల్పారు. గ్రామస్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

వడమాలపేట, జూలై 24: వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి చక్రపాణి కోరారు. బుధవారం మండలంలోని ఓబీఆర్ కండ్రిగలో ప్రజలకు అవగాహన కల్పించారు. అతిసార నివారణకు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని, వేడి చేసినా నీటిని తాగాలని తెలిపారు. కార్యక్రమంలో వైద్యాధికారి రాజేష్, వైద్యశాల సీహెచ్‌వో పురుసోత్తంరెడ్డి, సూపర్ వైజర్, చంద్రమోహన్ సిబ్బంది పాల్గొన్నారు.